



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

టీటీడీ గోశాలపై వైసీపీ దుష్ప్రచారం
మంత్రి లోకేష్ మండిపాటు
5

టీటీడీని దోచుకుని అసత్య ప్రచారాలా?
కరుణాకర్‌రెడ్డిపై బుచ్చి రాంప్రసాద్ ధ్వజం
12

## కూటమిది సుపరిపాలన

# ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామనే నమ్ముతున్నా

- పూలే స్ఫూర్తితో సంక్షేమ పాలన సాగిస్తున్నాం
- సంక్షేమంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నా
- సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించం
- చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- నూజివీడు నియోజకర్గంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆగిరిపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వం తరపున పూలే జయంతి వేడుకలు

2



## నేటి బంగారు కుటుంబాలే... రేపటి మార్గదర్శులు

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలి
'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

3

# కల్యాణం.. కమనీయం

- ఒంటిమిట్టలో వైభవంగా సీతారాముల కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు దంపతులు

*ఒంటిమిట్ట:* వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఒంటిమిట్టకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం చూసేందుకు భారీసంఖ్యలో భక్తులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. కల్యాణోత్సవం నిర్వహణకు తితిదే, జిల్లా యంత్రాంగం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 52 ఎకరాల విస్తీర్ణంలో కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. వేదికకు ఎదురుగా రెండువైపులా భక్తులు కూర్చోవడానికి 147 గ్యాలరీలు సిద్ధం చేశారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించేందుకు 13 భారీ ఎల్ఈడీ తెరలు అమర్చారు.





# రామరాజ్యమే నా ఆకాంక్ష

- శ్రీ సీతారామ కల్యాణ దర్శనం మన అదృష్టం
- ఒంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- కొండలపై ఆయుర్వేద మొక్కల పెంపకానికి చర్యలు
- ఒంటిమిట్టలో 'జై శ్రీరామ్' నినాదమే ప్రతిధ్వనించాలి
- ఒంటిమిట్టలోనూ త్వరలో అన్నప్రసాదం ప్రారంభం
- శ్రీరాముడు పవిత్ర కుటుంబ సంబంధాలకి ఆదర్శం
- శ్రీరాముని వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

6





మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను..

## యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

- రేపు వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది
- మంగళగిరిలోనే మొదటి లీప్ పాఠశాల
- శాశ్వత ఇంటి పట్టాల పంపిణీలో మంత్రి నారా లోకేష్
- నాలుగో రోజు ఉదయం రత్నాలచెరువుకు చెందిన 600 మందికి ఇంటి పట్టాలు అందజేత

8

# ఇంటిపట్టాలకు రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్

- వచ్చే వారం నుంచి మొదలు
- రెండేళ్లలో అమ్ముకునే హక్కు
- రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- 2019లో అనేక రకాలుగా అవమానించారు, మంగళగిరి ప్రజలు నా గౌరవం నిలబెట్టారు
- మంగళగిరిలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్
- నాలుగో రోజు మధ్యాహ్నం తాడేపల్లి మహానాడుకు చెందిన 430 మందికి ఇంటి పట్టాలు అందజేత

9



## 'పట్టా'భిషేకంతో పేదల్లో పెల్లుబికిన ఆనందం

- మంత్రి లోకేష్ వల్లే తమ కల సాకారమయిందని కృతజ్ఞతలు
- అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా పట్టాలు ఇచ్చారని సంతోషం
- మంగళగిరికి లోకేష్ శాశ్వతంగా ఎమ్మెల్యేగా ఉండాలని దీవెనలు



10

చైతన్యరథం

# కూటమిది సుపరిపాలన

- ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామనే నమ్ముతున్నా
- పూలే స్ఫూర్తితో సంక్షేమ పాలన సాగిస్తున్నాం
- సంక్షేమంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నా
- సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించం
- చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- నూజివీడు నియోజకర్గంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆగిరిపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వం తరపున పూలే జయంతి వేడుకలు





అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో సుపరిపాలన అందించేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని, నాపైన ప్రజలుంచిన నమ్మకాన్ని నిలబెడతాననే విశ్వాసం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కొత్త కాదని, సమైక్యాంధ్రలో తాను చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తనకు వేరే ఆశలు లేవని, మీ ప్రేమాభిమానాలు ఉంటే చాలన్నారు. మీ ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని చెప్పినట్టే రుజువు చేస్తున్నానని చెప్పారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో జరిగిన మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడారు.



## చరిత్ర మరిచిపోలేని గొప్ప వ్యక్తి పూలే

చరిత్రలో శాశ్వతంగా నిలిచేపోయే చాలా కొద్ది మంది వ్యక్తుల్లో జ్యోతిరావు పూలే ఒకరని సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. 'బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం పూలే. 198 ఏళ్లయినా ఇంకా పూలే జయంతి జరుపుకుంటున్నామంటే అదే ఆయన మనకు ఇచ్చిన స్ఫూర్తి. స్త్రీ విద్యకు ఆ రోజుల్లోనే అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. తన సతీమణిని ప్రోత్స హించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేశారు. బాల్య వివాహాలు, సతీసహగమనాలకు వ్యతి రేకంగా పోరాడారు. రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశారు.అంబేద్కర్ సైతం ఆదర్శంగాతీసుకుని ఆయన బాటలో నడిచారంటే పూలే గొప్పతనం అర్థం చేసు కోవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసిందే ఎన్టీఆర్

'పూలే బాటలోనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్రంలో మహిళా విద్యకు పెద్ద పీట వేసి ఏకంగా మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించే వరకు బీసీలకు న్యాయం జరగలేదు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటగా గుర్తించింది ఎన్టీఆర్. రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ. టీడీపీకి వెన్నుముక బీసీలు... బీసీలను ఆదరించే బాధ్యత టీడీపీది. తనతో సహా ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... ఇలా అందరం బీసీల కోసం ఆలోచిస్తున్నాం. వారి కోసం పనిచేస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు.

## బీసీల రక్షణ బాధ్యత టీడీపీది

అట్రాసిటీ యాక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఎలాగైతే రక్షణ కల్పిస్తున్నామో, త్వరలో బీసీల కోసం ప్రత్యేకం గా రక్షణ చట్టాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనిపై సబ్ కమిటీ వేశామని, నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇస్తే, గత ప్రభుత్వహయాంలో 24 శాతానికి కుదించారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. మళ్లీ 34శాతానికి బీసీ రిజర్వేష న్లు పెంచుతామని, నామినేటెడ్ పోస్టుల్లో 33శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేస్తామని హామీఇచ్చారు.

## బీసీలకు ఎంతో చేశాం... ఇంకా చేస్తాం

నాయీ బ్రాహ్మణ్ ఫెడరేషన్, ఎంబీసీ ఫెడరేషన్, బీసీలకు కార్పొరేషన్లు, బీసీ భవన్‌లు, బీసీలకు ప్రత్యేక ప్రణాళిక, బీసీ విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూళ్లు, మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్లు, విదేశాల్లో చదువుకునేలా రూ.15లక్షలు ఒక్కో విద్యార్థికి ఆర్థికసాయం, పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కోచింగ్, అలాగే బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పా టు చేసింది టీడీపీ. డీఎస్సీకి ప్రిపేరయ్యే అభ్యర్థులకు ప్రతి జిల్లానుంచి 220 మందికి కోచింగ్ అందిస్తా మని, ఆదరణ-3ని తీసుకువస్తామని ప్రకటించారు.

## బీసీల ఆదాయం పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు

బీసీల కులవృత్తులు దెబ్బతిన్నాయి. వారి ఆదాయం పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకువస్తున్నాం. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తున్నాం. నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు 2కిలోవాట్లకు రూ.80,000, 3కిలోవాట్లకు రూ.98 వేలు ప్రత్యేకంగా సబ్సిడీ ఇస్తున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణు లకు రూ.15,000 ఉన్న వేతనాన్ని రూ.25,000 వేలకు పెంచామని సీఎం వెల్లడించారు.

## ఆగిరిపల్లిలోనూ అన్న క్యాంటీన్

'అందరి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పెట్టామని అంటూ... మీ గ్రామంలోనూ త్వరలోనే అన్న క్యాంటీన్ పెడతామని హామీ ఇచ్చారు. 'డ్వాక్రా సంఘాలు నా మానస పుత్రికలు. లక్షమంది మహిళల్ని పారిశ్రామికవేత్తలు చేయాలనుకుంటున్నా. మా అమ్మ కష్టాలు ఎవరికీ కలుగకూడదని దీపం-2 పథకం కింద ఉచితంగా 3 సిలండర్లు ఏడాదికి ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15,000 చొప్పున ఇస్తాం. అన్నదాతలకు మే నుంచి ఏడాది రూ. 20,000 ఇస్తాం. అలాగే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో పరిహారం ఇస్తాం. సంపద సృష్టించి సంక్షేమానికి ఖర్చు పెడతాం. అప్పులుచేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రం మరింత నష్టపోతుంది' అని సీఎం చంద్రబాబు వివరించారు.

## పార్థసారథికి అండగా ఉంటా

నూజివీడు నియోజవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేవరకు మంత్రి పార్థసారథికి అండగా ఉంటాను. నూజివీడులో జనాభావృద్ధి కూడా తగ్గుతోందని, ప్రతి దంపతులు కనీసం ఇద్దరు చొప్పున పిల్లల్ని కనాలి. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో కోర్టు వివాదాల్లో చిక్కుకుపోయింది. మేము ఆ వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చూసి... ప్రాజెక్టు పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

## స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు

'సోషల్ మీడియా నేరస్తులకు అడ్డాగా మారింది. సోషల్ మీడియా ద్వారా ఎవరి వ్యక్తిత్వ హననం చేసినా వాళ్లకు అదే చివరి రోజు అవుతుంది. పిల్లలను మంచి పౌరులుగా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలి. తప్పు చేసిన వాళ్ల విషయంలో చంఢశాసనుడిగా ఉంటా. వివేకానంద రెడ్డిది గుండెపోటు అని మొదట జరిగిన ప్రచారాన్ని నమ్మి మోసపోయా, తర్వాత తెలిసింది అది గొడ్డలి పోటు అని. తప్పుడు ప్రచారం చేసినా, తప్పుగా మాట్లాడినా చర్యలు తప్పవు. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ స్వేచ్ఛగా తిరగలేదు. మా ప్రభుత్వంలో ఇచ్చిన స్వేచ్ఛను ఎవరూ దుర్వినియోగం చేసుకోకండి' అని చంద్రబాబు హితవు పలికారు.





చైతన్యరథం

### నేటి బంగారు కుటుంబాలే...

# రేపటి మార్గదర్శులు

- సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలి
- 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



నూజివీడు/ ఆగిరిపల్లి (చైతన్య రథం): సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న 10శాతం మంది అట్టడుగునున్న 20 శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి పిలుపునిచ్చారు. పేద కుటుంబాల్లో వెలుగు తెచ్చేవరకు అండగా ఉంటానని, నేడు బంగారు కుటుంబానికి ఎంపికైన వారి పిల్లలకు సహకారం అందిస్తే.. రేపు మార్గదర్శకులుగా తయారుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజలమధ్య ఆర్థిక అసమానతలు తగ్గాలని అభిప్రాయపడ్డారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు, అనంతరం బంగారు కటుంబం-మార్గదర్శి కార్యక్రమంలో మాట్లాడారు. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.... ఆగిరిపల్లిలోని 206 బంగారు కుటుంబాలకు వారి మార్గదర్శులు అండగా ఉంటారన్నారు. 'మొదటి దశలో రాష్ట్రంలోని 20 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. పేదలను ఆదుకుని శాశ్వతంగా పైకి తీసుకొస్తే పూలేను గుర్తు పెట్టుకున్నట్లుగానే మార్గదర్శకులను గుర్తుంచుకుంటారు. ఒకస్థాయి వరకు సొంతానికి, వ్యక్తిగతంగా కష్టపడతాం. తర్వాత మంచి పేరు కోసం కష్టపడతాం. అలాంటి వేదిక కోసమే ఈ మార్గదర్శి- బంగారు కుటుంబం కార్యక్రమం. మార్గదర్శకులు ఓట్లు కోసం రావడం లేదు. పేరు కోసం ముందుకు వస్తున్నారు. అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌లాంటి మహానుభావుల జయంతి వేడుకులు నిర్వహించుకుంటూనే పీ-4 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.

బంగారు కుటుంబాలకు ఎంపికైన వారిలో ఆగిరిపల్లి నివాసి ష్టారీ రేష్మ మాట్లాడుతూ.. తన భర్త డ్రైవర్‌గా పని చేస్తున్నారని, సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నామన్నారు. తన ముగ్గురు పిల్లన్ని చదివించుకోవడానికి సాయం కోరుతున్నామని అన్నారు. ఆగిరిపల్లికే చెందిన బోనం లక్ష్మీదుర్గా మాట్లాడుతూ.. 'నా భర్త బోన్ క్యాన్సర్‌తో మూడేళ్ల క్రితం చనిపోయారు. నాకు పింఛన్ కూడా రావడం లేదు. నాకు పాప, బాబు ఉన్నారు. సొంతిల్లు లేక తల్లిదండ్రులతో ఉంటున్నాను. పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్తున్నాను. జీవనోపాధి కల్పించాలని కోరుతున్నా' అన్నారు. వెంటనే సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. 'వచ్చే నెల నుంచే మీకు పింఛను మంజూరు చేయడంతోపాటు 12 నెలల పింఛను కూడా ఇస్తాం. సొంతిల్లు కూడా కట్టించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటా'మని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మార్గదర్శి, నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్ మాట్లాడుతూ.. 'మార్గదర్శి-బంగారు కుటుంబం చాలా మంచి కార్యక్రమం. దేశంలో ఎక్కడాలేని మంచి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. రాబోయే నాలుగేళ్లలో రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకూ ఆగిరిపల్లిలోని పేదలకు ఖర్చు చేస్తాం. ఆగిరిపల్లితోపాటు తుక్కులూరు గ్రామంలోనూ కార్యక్రమాన్ని చేపడితే ముందుకొస్తా'మని ప్రకటించారు. మరో మార్గదర్శి, కుశలవ గ్రూప్‌నుంచి సిద్ధార్థ మాట్లాడుతూ.. చదువుకోవడానికి ఇబ్బంది పడేవారికి సాయం అందిస్తాం. ఇల్లులేని వారికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత గౌతమ్ మాట్లాడుతూ.. 'హ్యాపీవ్యాలీ స్కూల్‌ను మీరే ప్రారంభించారు. వంద కోట్లు అప్పు చేసి స్కూలు కట్టించాను. ఆ అప్పంతా తీర్చాను. 300మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. వారు మంచి జీవితాన్ని ప్రారంభించేదాకా బాధ్యత తీసుకుంటాం. మీ పిలుపుతో మరిన్ని కార్యక్రమాలు చేపడతా'మని ప్రకటించారు.

నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్ అధినేత నితిన్ కృష్ణ మాట్లాడుతూ.. 'ఈ కార్యక్రమం ద్వారా మట్టిలో ఆణిముత్యాలను వెలికి తీసి ఉద్యోగాలిస్తా'మని హామీ ఇచ్చారు. మోడల్ డైరీ అధినేత పిన్నమనేని ధనప్రకాశ్ మాట్లాడుతూ.. హీల్ అనే పాఠశాల ద్వారా వెయ్యిమంది విద్యార్థులకు చదువు అందిస్తున్నామని, అనాథ పిల్లలను తీసుకుని చదివిస్తా'మని ప్రకటించారు. ఎన్‌ఆర్‌ఐ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ రావి వెంకటరావు మాట్లాడుతూ 'నాకు మార్గదర్శి సీఎం చంద్రబాబు. చంద్రబాబు చెప్పి చేసేవన్నీ చూసి నేర్చుకున్నాం. 60మందితో ప్రారంభమైన మా కాలేజీలో నేడు 6వేల మందిదాకా ఉన్నారు. ఎక్కువమంది కటుంబాలను దత్తత తీసుకునేందుకు ప్రయత్నిస్తా'మని హామీ ఇచ్చారు.













చైతన్యరథం

ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో జ్యోతిరావ్ పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు. అనంతరం పాడిరైతు నక్కనబోయిన కోటయ్య, క్షురకుడు బత్తుల జనార్ధన్‌తో సీఎం మాట్లాడారు. వారి వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను, స్థితిగతులను తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. వారికి సాయం ప్రకటించారు.

























# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం!






వైఎస్సార్ జిల్లా (చైతన్య రథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి కడప విమానాశ్రయానికి సాయంత్రం 5.10కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రయంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవితమ్మ, రోడ్లు మరియు రవాణా మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ నాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌లు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వీరితోపాటు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజుల రెడ్డి, సీ. ఆదినారాయణ రెడ్డి, ఆర్. మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రెసిడెంట్ మరియు పోలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసుల రెడ్డి, పార్టీ పులివెందుల ఇంచార్జ్ ఎం రవీంద్రనాథ్ రెడ్డి, పార్టీ కడప పార్లమెంట్ ఇంచార్జ్ సీ. భూపేష్‌రెడ్డి, రాజంపేట ఇంచార్జ్ సీ.జగన్మోహన్ రాజు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో వున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆప్యాయంగా అందరినీ పేరుపేరునా పలకరించారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు సాయంత్రం 5.17 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి వెళ్లారు.

### ఒంటిమిట్టకు చేరుకున్న సీఎం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప విమానాశ్రయం నుండి రోడ్డుమార్గాన సాయంత్రం 6 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహం చేరుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యుడు, మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జ్యోతుల నెహ్రూ, భానుప్రకాష్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు.. కోదండ రాముని దర్శనార్థం ఆలయానికి సాయంత్రం 6-22 గంటలకి బయలుదేరి వెళ్లారు.






## పూలే సేవలు చిరస్మరణీయం: సీఎం



అమరావతి (చైతన్య రథం): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళి సమర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈమేరకు 'ఎక్స్' వేదికపై పోస్టు పెడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం రావడానికి వందేళ్ల క్రితమే వర్ణ, కుల, లింగ వివక్షపై గళమెత్తి పోరాడి ప్రజలను చైతన్యపరచిన దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే. ఆయన స్ఫూర్తితో బీసీల అభ్యున్నతికి ఆదినుంచీ కృషిచేస్తూ బీసీల పార్టీగా పేరుగాంచింది తెలుగుదేశం. ఈరోజు మహాత్మా పూలే జయంతి సందర్భంగా ఆ అభ్యుదయవాది సామాజిక, దేశ సేవలను స్మరించుకుందాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## పూలే జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

### - మంత్రి లోకేష్ నివాళి



అమరావతి (చైతన్యరథం): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళులు అర్పించారు. అంటరానితనం. కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే అన్నారు.

సమసమాజ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం. పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

### - మంత్రి లోకేష్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఇంటర్ మీడియెట్ ఫలితాల విడుదలకు సర్వం సిద్ధమయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదల కానున్నట్లు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.inలో ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చునన్నారన. అదనపు సౌలభ్యం కోసం మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కి 'హాయ్' సందేశాన్ని పంపడం ద్వారా కూడా ఇంటర్ ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఫలితాల విడుదల సందర్భంగా విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల నిరంతర కృషి నేటి ఫలితాల్లో ప్రతిబింబించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

## టీటీడీ గోశాలపై వైసీపీ తప్పుడు ప్రచారం

### - మంత్రి లోకేష్ ఖండన

అమరావతి (చైతన్యరథం): టీటీడీ గోశాలలో ఆవుల మరణాల గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న నిరాధారమైన, దురుద్దేశపూరిత ప్రచారాన్ని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఆ ప్రచారంలో ఓ మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలేంటో టీటీడీ స్పష్టంగా తెలియజేసింది. అయినప్పటికీ ప్రజలను, ముఖ్యంగా తిరుమల శ్రీవారి భక్తులను తప్పుదారి పట్టించటానికి, రెచ్చగొట్టడానికి వైసీపీ నేతలు సాగిస్తున్న తప్పుడు కథనాలను, దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరుతున్నా. రాజకీయ లాభం కోసం పవిత్ర సంస్థల గురించి అబద్ధాలను వ్యాప్తి చేయడం సిగ్గుచేటు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

చైతన్యరథం

# రామరాజ్యమే నా ఆకాంక్ష

- శ్రీ సీతారామ కల్యాణ దర్శనం మన అదృష్టం
- ఒంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- కొండలపై ఆయుర్వేద మొక్కల పెంపకానికి చర్యలు
- ఒంటిమిట్టలో 'జై శ్రీరామ్' నినాదమే ప్రతిధ్వనించాలి
- ఒంటిమిట్టలోనూ త్వరలో అన్నప్రసాదం ప్రారంభం
- శ్రీరాముడు పవిత్ర కుటుంబ సంబంధాలకి ఆదర్శం
- శ్రీరాముని వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు







ఒంటిమిట్ట (చైతన్య రథం): రాష్ట్రంలో రామరాజ్యం తేవాలన్నదే తన ఆకాంక్షగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శ్రీరాముడి స్ఫూర్తితో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే ధ్యేయమన్నారు. ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామి కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణం చూడటానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. శ్రీరామ రాజ్యాన్ని మళ్ళీ స్థాపించాలనే తపన తనదని, ప్రజలందరూ శ్రీరాముడు చూపించిన నీతి, ధర్మమార్గాన్ని అనుసరించి జీవించాలని ఆకాంక్షించారు. సీతారాముల దివ్య కల్యాణాన్ని వీక్షించడం ప్రతి ఒక్కరి అదృష్టంగా అభివర్ణించారు. శ్రీరాముడు ఒక వాగ్దానాన్ని ఎలా నిలబెట్టుకోవాలో, తండ్రి ఆజ్ఞను ఎలా విధిగా పాటించాలో, కుటుంబ బంధాలను ఎలా పరిపూర్ణంగా పోషించాలో తెలియజేశారని సీఎం గుర్తు చేశారు. తిరుమలలో గోవింద నామం ప్రతిధ్వనిస్తున్న విధంగా, వొంటిమిట్టలో 'జై శ్రీరామ్' నినాదమే మిన్నగా వినిపించాలని, రాష్ట్ర విభజన తర్వాత వొంటిమిట్టను ప్రధాన పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ఈ ఆలయ బాధ్యతలను దశాబ్దం క్రితమే టీటీడీకి ఇచ్చినట్టు చెప్పుకొచ్చారు. ఈ భవ్యమైన రోజున.. తిరుమల మాదిరిగా వొంటిమిట్టలోనూ అన్నప్రసాదం ప్రారంభించాలన్న నిశ్చయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తీసుకోవాలని కోరుతున్నాను అని భక్తుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. వొంటిమిట్టను పుణ్యభూమిగా మార్చేందుకు ఇక్కడి కొండలపై ఆయుర్వేద మొక్కలను నాటుతామన్నారు. అదేవిధంగా వొంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ దేశంగా మారుతుందన్న నమ్మకాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు వొంటిమిట్టలో అన్నప్రసాదం త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి సవితా, దేవాదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


















రక్షతి
రక్షితః









## మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను..

# యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

- రేపు వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది
- మంగళగిరిలోనే మెదటి లీప్ పాఠశాల
- శాశ్వత ఇంటి పట్టాల పంపిణీలో మంత్రి నారా లోకేష్
- నాలుగో రోజు ఉదయం రత్నాలచెరువుకు చెందిన 600 మందికి ఇంటి పట్టాలు అందజేత





మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి నియోజక వర్గానికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ఉదయం మంగళగిరి డాన్‌బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో రత్నాలచెరువుకు చెందిన 600 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. కొన్ని నిర్ణయాలు మన జీవితాలనే మార్చేస్తాయన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో నేనొక నిర్ణయం తీసుకున్నా. మీ సమస్యలేంటో నాకు తెలియదు. నేనేంటో మీకు తెలియదు. ఎన్నికలకు 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా పోటీచేశా. 5,300 ఓట్లతో ఓడిపోయా. మొదటి రోజు బాధ కలిగింది, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ప్రజలకు మంచి పనులు చేసి వారి మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నిర్ణయించుకున్నానని మంత్రి లోకేష్ తెలిపారు.

### 26 సంక్షేమ కార్యక్రమాలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మంగళగిరి ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలను సొంత నిధులతో అమలు చేశాను. 2019 నుంచి 2024వరకు ప్రతి పక్షంలో ఉన్నప్పటికీ మంగళగిరి ప్రజల ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని తీసుకువచ్చాను. తాడేపల్లిలో, మంగళగిరిలో, దుగ్గిరాలలో క్లినిక్‌లు ఏర్పాటుచేసి నేటికీ కొనసాగిస్తున్నాం. ఈ రోజుకీ సొంత నిధులతో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. కుటుంబంలో పెళ్లి జరిగితే పెళ్లి కానుక ఇస్తున్నాం. మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడంతో పాటు శిక్షణ కూడా అందించాం. వారికి ఉపాధి కూడా కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తాగునీరు సక్రమంగా అందించలేకపోతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. యువత క్రికెట్ ఆడేందుకు మంగళగిరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటుచేశాం. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు మందులు అందించాం. అమెరికా డాక్టర్ల ద్వారా టెలీమెడిసిన్ సేవలు అందజేశాం. ఈ విధంగా దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం అమలు చేశామని మంత్రి లోకేష్ చెప్పారు.

### ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా

2024 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేయాలని చాలా మంది చెప్పారు. ఐదేళ్లు కష్టపడ్డా, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకున్నానని ఆనాడు చెప్పా. ఒకే స్థానం నుంచి పోటీ చేస్తా.. అదీ మంగళగిరి నుంచే పోటీచేస్తానని చెప్పా. ప్రచారంలో మీవద్దకు వచ్చాను. ఏ మెజార్టీతో అయితే ఓడిపోయానో దాని పక్కన సున్నాపెట్టి 53వేల ఓట్లతో గెలిపించాలని కోరా. మీరు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా. సర్వేల్లో కుప్పం కంటే ఒక్క శాతం వెనుకబడి ఉన్నాం. మీరు చూపించిన అభిమానం, ప్రేమ చూసి ఒక్క ఓటు అన్నా ఎక్కువ వస్తుందని అధినేత చంద్రబాబుతో ఛాలెంజ్ చేశా. మంగళగిరి ప్రజలు ఎవరూ ఊహించని విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారని మంత్రి లోకేష్ అన్నారు.

### రేపు వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

మీరు ఇచ్చిన మెజార్టీ కొండంత బలం. దశాబ్దాల కల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి. ఏపీలో మొదటి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంగళగిరి నియోజకవర్గానికి శాంక్షన్ అయింది. ఈ నెల 13న శంకుస్థాపన చేస్తున్నాం. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. చిల్లపల్లి బాధ్యత తీసుకుంటారు. పార్క్‌లు, చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్‌లైన్, భూగర్భ గ్యాస్, కరెంట్ ప్రాజెక్టులు చేపడుతున్నాం. జూన్, జులైలో ఆ కార్యక్రమాలు కూడా చేపడతాం. కొండ దిగువన లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం తర్వాత పానకాలస్వామి గుడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చాలామంది చెప్పారు. దీంతో ఉచితంగా బస్సు ఏర్పాటుచేశాం. మంగళగిరి, తాడేపల్లి నుంచి ఎయిమ్స్‌కు వెళ్లేందుకు రెండో బస్సు కూడా ఉచితంగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇచ్చిన ప్రతి హామీ పద్ధతి ప్రకారం అమలు చేస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

### రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది

దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు శాశ్వత ఇంటి పట్టా ఇవ్వాలని ఆనాడు మంగళగిరి ప్రజలు కోరారు. తొలి విడత పట్టాలు సంవత్సరంలోగానే ఇస్తానని చెప్పా. ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేందుకు మరో సంవత్సరం పడుతుందని ఆనాడే చెప్పా. అటవీ, కాలువ, కొండ పోరంబోకు భూములకు కొంత సమయం పడుతుంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే మీ లోకేష్ ఈ రోజు మీ ముందు నిలబడ్డాడు. కూటమి నాయకులందరూ కలిసికట్టుగా అధికారులతో మీ ఇంటికి వచ్చి కప్పు కాఫీ కూడా తాగకుండా ఇంటి కొలతలు తీసుకుని వివరాలు సేకరించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో మాట్లాడి సహకరించాలని కోరా. ఈజీవో రాష్ట్ర ప్రజలకు కూడా పనికివస్తుందని చెప్పా. అనగాని ప్రోత్సాహంతో ఈ రోజు మంగళగిరి నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారుగా 3200 కుటుంబాలకు ఉచితంగా ఇంటి పట్టాలను ఎన్డీయే ప్రభుత్వం అందజేస్తోంది. ఈ సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోందని మంత్రి లోకేష్ తెలిపారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి పాఠశాల మంగళగిరిలోనే

పేదలకు పట్టాల రూపంలో ఇస్తున్న ఈ ఆస్తి విలువ వెయ్యి కోట్ల రూపాయలు. నేనిచ్చే పట్టాతో వెంటనే రిజిస్టర్ చేసుకోవచ్చు. రెండేళ్ల తర్వాత అమ్ముకునే హక్కు కూడా వస్తుంది. శాశ్వత హక్కు ఎన్డీయే ప్రభుత్వం మీకు కలుగజేస్తోంది. ఇది మనందరి దశాబ్దాల కల. ఆ హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం. విద్యాశాఖ మంత్రిగా లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి స్కూల్ మంగళగిరి నియోజకవర్గంలోనే అభివృద్ధి చేయబోతున్నాం. 50 రోజుల్లో పాఠశాలల రూపురేఖలు మారిపోవాలని అధికారులతో చెబుతున్నా. పట్టుదలతో పనిచేస్తున్నానని మంత్రి లోకేష్ చెప్పారు.

### యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

మంగళగిరి ప్రజలు అన్నివిధాలుగా నాకు అండగా నిలిచారు. అవినీతి రహిత పాలన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మంగళగిరి ప్రజలను నా గుండెల్లో పెట్టుకుని అహర్నిశలు పనిచేస్తా. సూపర్ సిక్స్‌లో కొన్ని హామీలు మే నెలలో అమలుచేయబోతున్నాం. మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.












# ఇంటిపట్టాలకు రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్

- వచ్చే వారం నుంచి మొదలు
- రెండేళ్లలో అమ్ముకునే హక్కు
- రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- 2019లో అనేక రకాలుగా అవమానించారు, మంగళగిరి ప్రజలు నా గౌరవం నిలబెట్టారు
- మంగళగిరిలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్
- నాలుగో రోజు మధ్యాహ్నం తాడేపల్లి మహానాడుకు చెందిన 430 మందికి ఇంటి పట్టాలు అందజేత
- మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందించిన లోకేష్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గంలోని పేదలకు ఇప్పుడు ఇస్తున్న ఇంటి పట్టాలను వచ్చే వారం నుంచి రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని విద్య. ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు కూడా వస్తుందన్నారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి డాన్‌బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. శుక్రవారం మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ..2019 నుంచి 2024 వరకు తనను అనేక రకాలుగా అవమానించారన్నారు. మంగళగిరిలో గెలవలేదని హేళన చేశారు. సొంత కొడుకుని గెలిపించుకోలేకపోయారని అధినేత చంద్రబాబుని కూడా అన్నారు. అప్పుడు 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఓటమి నాలో కసి పెంచింది. ఓడినా మంగళగిరిని వీడలేదు. సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నారు. గత ఎన్నికల్లో మంగళగిరి ప్రజలను ఒకటే కోరా. 2019 ఎన్నికల్లో ఎన్ని ఓట్ల తేడాతో ఓడించారో.. ఆ సంఖ్య పక్కన సున్నా పెట్టి 53,000 ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరాను. అయితే అందరికీ దిమ్మతిరిగి విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ రోజు ఇన్ని మంచి కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం చేస్తున్నానంటే దానికి కారణం మీరు ఇచ్చిన మెజార్టీయే. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. రెండో కేబినెట్ మీటింగ్‌లోనే దానికి ఆమోదం పొందాం. ఈ నెల 13వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందిస్తాం. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. పార్క్‌లు, చెరువులు అభివృద్ధి చేస్తాం. పిల్లలు ఆడుకునేందుకు క్రికెట్ టర్ఫ్ లు, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటుచేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.



## రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తాం

తాడేపల్లిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటుచేశాం, ఆరోగ్యంగా ఉండాలంటే అందరం నడవాలి. గంట సేపు వ్యాయామం చేయాలి. నడవాలంటే పార్క్‌లు కావాలని ఆనాడు అడిగారు. కొన్ని వార్డుల్లో పార్క్‌లు నిర్మిస్తున్నాం. ఇటీవల మంగళగిరిలో ఎస్ఎల్ఎన్ పార్క్ ను ప్రారంభించాం. మరో 6 పార్క్ లు సిద్ధమవుతున్నాయి. 31 కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని ఆనాడు కోరారు. అందులో 17 భవనాలకు భూములను కూడా గుర్తించాం. రెండు భవనాల పనులు కూడా పూర్తికాబోతున్నాయి. వాటిని త్వరలోనే ప్రారంభించబోతున్నాం. మిగతా భవనాలు కూడా యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం. రూ.300 కోట్ల వ్యయంతో కృష్ణానదిలో రిటైయినింగ్ వాల్ నిర్మించబోతున్నాం. దానిని పూర్తి చేసే బాధ్యత మేం తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## గతంలో చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోలేదు

2019లో ఓడిపోయినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. బాధ కలిగింది. ఈ సారి ఇంత మెజార్టీ గెలిపించడంతో నా పరువును కాపాడారు. శాసనసభలో నా గౌరవం పెంచారు. కేబినెట్‌లో మంగళగిరి ప్రజలకు ఏదైనా చేయాలంటే చర్చ అవసరం లేకుండానే మంజూరు చేస్తున్నారు. మా పైన బాధ్యత పెరిగింది. దశాబ్దాల కల అయిన శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని కోరారు. మూడు, నాలుగు దశల్లో ఇంటి పట్టాలు అందిస్తామని ఆనాడు చెప్పా. ఏడాదిలోగా బట్టలు పెట్టి మొదటి దశ ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పా. 11 నెలల్లో హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. పద్ధతి ప్రకారం హామీలు నిలబెట్టుకుంటున్నాం. అవినీతిరహితంగా చేస్తున్నాం. గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగారు. జిరాక్స్‌లకు, అర్జీలకే వేలరూపాయలు ఖర్చు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన కొలతలు తీశాం. ఆ వివరాలన్నీ వచ్చిన వెంటనే కేబినెట్‌లో చర్చించి పాలసీ తీసుకువచ్చాం. ఈ నిర్ణయం వల్ల మంగళగిరి ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి లబ్ధి చేకూరుతుందని మంత్రి లోకేష్ తెలిపారు.

## రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు

వచ్చే వారం నుంచి ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రెండేళ్లలో పట్టా అమ్ముకునే హక్కు కూడా మీకు వస్తుంది. దయచేసి ఎవరూ అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మన ప్రాంతం అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది. మంగళగిరిని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతున్నాం. అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. స్వచ్ఛతలో మీ సహకారం కావాలి. మీరు నన్ను పెద్దఎత్తున గౌరవించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారు. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. మీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని మంత్రి లోకేష్ చెప్పారు.















## ‘పట్టా’భిషేకంతో

# పేదల్లో పెల్లుబికిన ఆనందం

- మంత్రి లోకేష్ వల్లే తమ కల సాకారమయిందని కృతజ్ఞతలు
- గత ఎన్నికల ముందు మాట ఇచ్చారు
- నేడు అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా పట్టాలు ఇచ్చారని సంతోషం
- మంగళగిరికి లోకేష్ శాశ్వతంగా ఎమ్మెల్యేగా ఉండాలని దీవెనలు





మంగళగిరి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శాశ్వత ఇంటిపట్టాలు అందుకున్న మంగళగిరి నియోజకవర్గ పేదల్లో ఆనందం ఉప్పొంగుతోంది. దశాబ్దాలుగా ఎందరు నాయకుల చుట్టూ తిరిగినా కాని పని, నేడు మంత్రి లోకేష్ చొరవతో అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కార్యరూపం దాల్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి లోకేష్ పట్టుదల వల్లే తమ ఏళ్లనాటి కల సాకారమయిందని కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బట్టలు పెట్టి మరీ శాశ్వత ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి లోకేష్ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదంటున్నారు. లోకేష్..మంగళగిరికి శాశ్వతంగా ఎమ్మెల్యేగా ఉండాలని దీవిస్తున్నారు. లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

### పార్టీలు పట్టించుకోకుండా పట్టాలు ఇచ్చారు

## లోకేష్ ప్రజలకు మంచి చేశారు

మేం గత 43 ఏళ్లుగా మంగళగిరి రత్నాల చెరువులో నివాసం ఉంటున్నాం. పట్టాల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. గతంలో ఇంటి పట్టాలు అడిగితే రత్నాల చెరువులో ఇళ్లను తొలగిస్తామని చెప్పారు. దీంతో మా ఇళ్లను ఎప్పుడు తొలగిస్తారో నని భయంభయంగా జీవనం సాగించాం. నారా లోకేష్ పార్టీలు పట్టించుకోకుండా పట్టాలు ఇచ్చారు. ప్రజలకు మంచి చేసే వారే నాయకులు. లోకేష్ ప్రజలకు మంచి చేశారు. ఆయన చేతులమీదుగా శాశ్వత ఇంటి పట్టాలు అందుకోవడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు ఇళ్లను తొలగిస్తారనే భయం మాకు లేదు.

**- దర్శనం హంస, దర్శనం సీత, ఏసమ్మ**
**రత్నాలచెరువు, మంగళగిరి**



### మంచి మెజార్టీతో గెలిపించినందుకు

## లోకేష్ ప్రజల రుణం తీర్చుకుంటున్నారు



మంగళగిరి రత్నాలచెరువులో 42 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాను. పట్టాల విషయంలో ఎంతో మంది నాయకులు వచ్చి కాకమ్మ కబర్లు చెప్పి వెళ్లిపోయారు. లోకేష్ మొదటి సారి గెలిస్తే ఇంటిపట్టాలు ఇచ్చేవారేమో. దురదృష్టం ఆయన గెలవలేదు. ఆయనేంటో ప్రజలకు అర్థం కాలేదు. రెండోసారి మంచి మెజార్టీతో గెలిపించినందుకు లోకేష్ ప్రజల రుణం తీర్చుకుంటున్నారు. 42 ఏళ్ల కల నిజమైనందుకు ఆనందంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు లోకేష్‌కి ధన్యవాదాలు.

**- నాగులపల్లి వెంకట సత్యనారాయణ**
**రత్నాలచెరువు, మంగళగిరి**

### 40 ఏళ్లుగా ఇంటి పట్టా కోసం ఎదురుచూస్తున్నాం..

## లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



మేం మంగళగిరి రత్నాలచెరువు ఎస్టీకాలనీలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. చిల్లరకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. నా చిన్ననాటి నుంచి ఇక్కడే పెరిగా. ఇంటి పట్టా కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఎన్నికల సమయంలో నారా లోకేష్ వచ్చి.. శాశ్వత ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అన్నట్లుగా పట్టా ఇచ్చి.. మాట నిలబెట్టుకున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది.

**- కొండా శివమ్మ, రత్నాలచెరువు, మంగళగిరి**

## లోకేష్ నిజమైన హీరో..

### రూపాయి ఖర్చులేకుండా ఆస్తిపై హక్కు కల్పించారు



మా తండ్రి 40 ఏళ్ల క్రితం మంగళగిరి రత్నాలచెరువులో రూ.150తో పూరిపాకను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి మేం ఆ ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. లోకేష్ వచ్చిన తర్వాత ఆస్తిపై మాకు శాశ్వత హక్కు కల్పించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆయనే నిజమైన హీరో. మేం ఇంటి పట్టా కోసం ఎవరికీ రూపాయి ఇవ్వలేదు. ఎవరి చుట్టూ తిరగలేదు. అధికారులే వచ్చి కొలతలు తీసుకున్నారు. ఇవాళ లోకేష్ చేతుల మీదుగా ఇంటి పట్టా అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

**- బందరు రాజ్యలక్ష్మి, సుబ్బారావు**

### ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు పట్టాలు ఇవ్వలేదు

## మా 45 ఏళ్ల కల లోకేష్ నెరవేర్చారు



మేం 45 ఏళ్లుగా మంగళగిరి రత్నాలచెరువులో నివాసం ఉంటున్నాం. నేను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు నలుగురు కుమార్తెలు. నా భర్త ఇటీవలే మరణించారు. దశాబ్దాలుగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి రత్నాలచెరువులో జీవనం సాగిస్తు న్నాం. గతంలో ఇక్కడ మంచినీరు కూడా లభించేది కాదు. ఎంతో మంది నాయకులు వచ్చారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. అయినా మాకు పట్టాలు ఇవ్వలేదు. ఇప్పుడు నారా లోకేష్ చేతుల మీదుగా శాశ్వత ఇంటి పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా 45 ఏళ్ల కలను నారా లోకేష్ నెరవేర్చారు.

**- ఇటికాల పెద్దింట్లమ్మ, రత్నాలచెరువు, మంగళగిరి**



### ఇంటి పట్టా కోసం తిరిగి తిరిగి వేసారాం..

## ఇప్పుడు సంతోషంగా ఉంది

మేం 13 ఏళ్లుగా మంగళగిరి రత్నాలచెరువులో నివాసం ఉంటున్నాం. నేను రిక్షాబండి నడపుకుంటుండగా..నా భార్య కూలిపనులకు వెళ్తుంది. గతంలో ఇంటి పట్టా కోసం అనేక సంవత్సరాలు నాయకుల చుట్టూ తిరిగి తిరిగి వేసారాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు నారా లోకేష్ బట్టలు పెట్టి శాశ్వత ఇంటి పట్టా ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రత్నాల చెరువులో రోడ్లు వేశారు. ఇక్కడకు వచ్చి ఇంటి పట్టా అందుకుని సంతోషంగా వెళ్తున్నాం.

**- గరిక రాములు, రమణమ్మ, రత్నాలచెరువు, మంగళగిరి**

### గతంలో ఎవరివల్లా కాలేదు..

## లోకేష్ వల్లే ఇంటి పట్టా సాధ్యమైంది!

తాడేపల్లి మహానాడులో గత 40 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాం. మహానాడు కాలనీ ఏర్పడిన నాటి నుంచి అక్కడే నివసిస్తున్నాం. ఇంటి పట్టాల కోసం గతంలో ఎంతో మంది నాయకులను కలిసి విజ్ఞప్తి చేశాం. ఎవరివల్లా కాలేదు. నారా లోకేష్ వల్లే ఇంటి పట్టా సాధ్యమైంది. ఇక్కడకు వచ్చిన తర్వాత సదుపాయాలు బాగా ఉన్నాయి. మర్యాదగా చూసుకున్నారు. లోకేష్ చేతుల మీదుగా శాశ్వత ఇంటి పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. మా కల నెరవేరింది.

**- సాలిపల్లి రేయమ్మ, దుర్గారావు**
**మహానాడు 6వ రోడ్డు, తాడేపల్లి**



























# టిడ్కో కాలనీల్లో ఎంఎస్ఎంఈ యూనిట్లు

- 163 ప్రాంతాల్లో జీవనోపాధి కేంద్రాలు
- మహిళా పారిశ్రామికవేత్తల తయారీ లక్ష్యం
- ఈ ఏడాది 30 వేల మందికి శిక్షణ..ఉపాధి
- మంత్రి నారాయణ బృందం అధ్యయనం
- ఎలీప్ ఎంఎస్ఎంఈ పార్క్ సందర్శన





అమరావతి/హైదరాబాద్(చైతన్యరథం): రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ఏపీ మున్సిపల్ శాఖ వేగంగా అడుగులు ముందుకు వేస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకోగా పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను రూపొందించాలనేది టార్గెట్‌గా పెట్టు కున్నారు. దీని కోసం ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కొంతకాలంగా అధ్యయనం చేస్తోంది. రాష్ట్రంలోని టిడ్కో గృహాల్లో నివసించే మహిళల ద్వారా ఎంఎస్ఎంఈ యూని ట్లు నెలకొల్పి వారికి జీవన భృతి కల్పించాలని నిర్ణయించింది. టిడ్కో నివాస సముదా యాల్లో ఖాళీ స్థలాలున్న 163 ప్రాంతాల్లో పట్టణ పేదరిక సంస్థ ద్వారా లైవ్‌లీ హుడ్ సెం టర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ జీవనోపాధి కేంద్రాల్లో(లైవ్ లీ హుడ్ సెంటర్లు) మహి ళలకు వివిధ నైపుణ్యాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారితో ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయిస్తారు. అయితే ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేయాలి, ఏయే యూనిట్ల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుంది, ఎలాంటి సాంకేతిక ఉపయోగించాలనే దానిపై అధ్య యనం చేస్తున్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా హైద రాబాద్‌లోని ప్రగతినగర్‌లో మహిళా పారిశ్రామిక వేత్తల అసోసియేషన్(ఎలీప్) ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను మంత్రి నారాయణ బృందం సందర్శించింది. ఆయనతో పాటు మెప్మా, టిడ్కో ఎండీలు, పరిశ్రమల శాఖ అధికారులు ఉన్నారు. ఎంఎస్ఎంఈ పార్క్‌లో ఉన్న స్టార్టప్ కంపెనీలతో పాటు పలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను సందర్శించి వాటి యజమానుల నుంచి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఆయా కంపెనీల ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయా ల్సిందిగా పరిశ్రమల శాఖ, పురపాలక శాఖ అధికారులను మంత్రి నారాయణ ఆదేశిం చారు. ఈ పర్యటనలో మంత్రి నారాయణతో పాటు మెప్మా ఎండీ తేజ్ భరత్, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శాప్ కార్యకలాపాలు మరింత విస్తృతం

- క్రీడల అభివృద్ధే ప్రధాన అజెండా
- సమ్మర్ క్యాంపులకు త్రిసభ్య కమిటీలు
- ప్రతి జిల్లాకు కోచ్‌ను నియమించాలి
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు
- సమ్మర్ క్యాంపుల నిర్వహణపై సమీక్ష




విజయవాడ (చైతన్యరథం): ఏపీ క్రీడాప్రాధికార సంస్థ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని, క్రీడల అభివృద్ధే అజెండాగా అంకితభావంతో పనిచేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. విజయవాడ శాప్ కాన్ఫరెన్స్ హాలులో శాప్ అధికారులు క్రీడల అభివృద్ధి, సమ్మర్ క్యాంపుల నిర్వహణపై శుక్రవారం ఆయన సమీ క్షించారు. క్రీడా సంఘాలను సమన్వయం చేసుకుని ఏపీలో పెద్దఎత్తున క్రీడాపోటీలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. స్పోర్ట్స్ ఫెడరేషన్లు నిర్వహించే క్రీడలను ఏపీలోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా సౌకర్యాలు సమకూరుతాయన్నారు. క్రీడల నిర్వహణకు అనుగుణంగా ప్రభుత్వం తరపున శాప్ కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని వివరించారు.

### ప్రణాళికాబద్ధంగా సమ్మర్ క్యాంపులు

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ 20 నాటికి అన్ని జిల్లాల డీఎస్ డీవోలకు సమగ్ర సమాచారాన్ని పంపించాలని, పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకునేలా సర్క్యులర్ జారీ చేయాలన్నారు. ముఖ్యంగా సమ్మర్ క్యాంపుల నిర్వహణకు జిల్లా స్థాయి లో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు డీఎస్‌డీవోలతో పాటు ప్రతి జిల్లాకు కోచ్‌ను కూడా నియమించాలని సూచించారు. అలాగే విద్యార్థులు కూడా వేసవి శిబిరా లను సద్వినియోగం చేసుకునేలా 26 జిల్లాల విద్యాశాఖాధికారులకు శాప్ నుంచి సర్క్యు లర్ పంపించాలని కోరారు. క్రీడాకారులకు నాణ్యమైన క్రీడా సామగ్రిని మాత్రమే అం దజేయాలని, వారి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వెల్లడించారు. సమ్మర్ క్యాంపు లోని క్రీడా కార్యక్రమాలు క్రీడాయాప్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా క్రీడాయాప్‌లో లేని అసోసి యేషన్లు, క్రీడాకారులు సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు పడతారని.. తప్పనిసరిగా యాప్‌లో నమోదుకావాలని సూచించారు. క్రీడా కారులను ప్రోత్సహించే విధంగా క్రీడాకారుల విజయాలను ప్రసార, సామాజిక మాధ్య మాల ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు.

## టీటీడీని దోచుకుని అసత్య ప్రచారాలా?

- తిరుమల ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు
- హరిప్రసాద్‌రెడ్డి కోసం కరుణాకర్‌రెడ్డి అసత్యాలు
- 2 వేల గోవులు చనిపోయాయంటూ దుష్ప్రచారం
- బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్



మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ నేతలు నియమించి ఇటీవల తిరుపతిలో తొక్కిస లాట జరిగి భక్తుల ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన హరిప్రసాద్‌రెడ్డిని ఎలాగైనా కాపాడాలనే ఉద్దేశంతో కరుణాకర్‌రెడ్డి కుట్రలకు తెరలేపి టీటీడీ దిగజార్చేలా అస త్యాలు ప్రచారం చేస్తున్నాడని బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నక్సలైట్ ఉద్యమంలో ఉన్నప్పుడు వెంకటేశ్వర స్వామి ఒక నల్లరాయి అని.. రాయితో కొడితే మాత్రం వెంకటేశ్వరస్వామి ఏమి చేయ గలడని మాట్లాడిన నీచ చరిత్ర కరుణాకర్‌రెడ్డిది. చైర్మన్ పదవిని అడ్డుపెట్టుకుని టీటీడీ నిధులను మళ్లించి దోచుకోవడమే కాక.. పవిత్రమైన టీటీడీ లడ్డును మున్సిపల్ ఎన్నికల్లో ఇంటింటికీ పంచి రాజకీయ ప్రయోజనానికి వాడుకున్న దుర్మార్గులని ధ్వజమెత్తారు. డాలర్ల కుంభకోణం, బంగారు నగల కుంభకోణం, డిపాజిట్ల కుంభకో ణంతో పాటు ఇష్టానుసారంగా టీటీడీని దోచుకుని నేడు సిగ్గులేకుండా అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదవులపై ఒక మతం, మనసులో మరో మతం పెట్టుకుని టీటీడీ చైర్మన్‌గా చేసి టీడీడీ పవిత్రను మంటగలిపిన వ్యక్తులు టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోరాదని.. కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గోవును మనం లక్ష్మీ స్వరూపంగా భావిస్తాం. అలాంటి గోవును కూడా వైసీపీ నీచ నేతలు రాజకీయాలకు వాడుతున్నారు. టీడీపీ పాలనలో టీటీడీ ప్రతిష్ట పెరుగుతుంటే ఓర్వలేకపోతున్నారు. వైసీపీ పాలనలో టీటీడీలో జరిగినన్ని అక్ర మాలు ఈ దేశ చరిత్రలో ఏనాడూ జరగలేదు. సిట్ దర్యాప్తులో వైసీపీ నేతల అక్ర మాలు బయటకు వచ్చాయి. దీంతో వైసీపీ ప్రతిష్ట పూర్తిగా దిగజారింది.. అందుకే నేడు గోవుల పేరుతో టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నుతు న్నారు. కొత్త డ్రామాలకు తెరలేపారు. కరుణాకర్‌రెడ్డి 100 గోవులు చనిపోయాయని అసత్యాన్ని ప్రచారం చేస్తున్నాడు. పొనమనూరు నుంచి వచ్చిన ఒక్క ఆవు మాత్రమే అనారోగ్యంతో మృతిచెందింది. దాదాపు 2,650 గోవులు గోశాలలో ఉన్నాయి. వాటి ని జియో ట్యాగ్ ద్వారా ప్రతిరోజూ టీటీడీ వారు పర్యవేక్షిస్తున్నారు. గోశాలను శుభ్రం చేయడం.. వాటికి మెరుగైన ఆహారం ఇవ్వడంతో పాటు అన్ని సక్రమంగా జరుగుతు న్నాయి. ప్రభుత్వ ప్రతిష్టను, టీటీడీ ప్రతిష్టను దిగజార్చేందుకే కరుణాకర్‌రెడ్డి దుష్ప్ర చారాలు చేయడం మొదలెట్టాడు. నాడు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి కొలు వై ఉన్న నిలయంలో అన్యమత ప్రచారానికి పూనుకున్నారు. రూముల రేట్లు పెంచి భక్తులను దోచుకున్నారు.. హిందూ మతంపై దాడి చేశారు. మళ్లీ సిగ్గులేకుండా నేడు అసత్యాలను వల్లించి భక్తులను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

## గోరంట్ల మాధవ్‌కు 24 వరకు రిమాండ్

గుంటూరు: మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కేసులో మాధవ్‌తో పాటు అరెస్టయిన మిగతా ఐదుగురికి కూడా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మాధవ్‌ను శుక్రవారం తొలుత నల్లపాడు పిఎస్ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన. పోలీసులు అక్కడ వైద్య పరీక్షలు చేయించారు. వైద్య పరీక్షల అనంతరం మాధవ్‌ను ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. మాధవ్ తరపున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. గోరంట్ల మాధవ్‌కు రిమాండ్ తిరస్కరించాలని కోర్టును కోరారు. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. మాధవ్‌కు ఏప్రిల్ 24 వరకు రిమాండ్ విధించారు. దీంతో మాధవ్ సహా నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు.

### కోర్టు వద్ద మాధవ్ దురుసు ప్రవర్తన...

గోరంట్ల మాధవ్‌ను పోలీసులు గుంటూరు జిల్లా కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో ఆయన మరోసారి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. మీడియా ముందుకు రావడానికి నిరాకరించారు. ఎంపీగా పనిచేసిన వ్యక్తిని మీడియా ముందుకు తీసుకొస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పోలీసు విధులకు ఆటంకం కలిగించారు

అంతకుముందు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేశామని వెల్లడించారు. మాధవ్ అరెస్ట్ వివరాలను విశదీకరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో చేబ్రోలు కిరణ్ కుమార్‌ను గురువారం అరెస్ట్ చేశామని.. ఆ క్రమంలో పోలీసుల అదుపులో ఉన్న అతడిపై చుట్టగుంట వద్ద గోరంట్ల మాధవ్ దాడికి పాల్పడ్డారని తెలిపారు. పోలీసులపై జులుం ప్రదర్శించడమే కాకుండా.. వారి విధులకు సైతం ఆటంకం కలిగించారన్నారు. ఇది నేరపూరత చర్య అని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ దాడిలో గోరంట్ల మాధవ్‌తోపాటు మరో ఐదుగురు పాల్గొన్నారని వివరించారు. ఇక ఎస్పీ కార్యాలయం వద్ద సైతం చేబ్రోలు కిరణ్ కుమార్‌పై గోరంట్ల మాధవ్ మరోసారి దాడికి పాల్పడ్డారని చెప్పారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

### టీడీపీ కేంద్ర కార్యాలయంలో నివాళులర్పించిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

మంగళగిరి (చైతన్యరథం): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు నివాళులర్పిం చారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై మొట్టమొదటి గళమెత్తిన వ్యక్తి జ్యోతిరావు పూలే సామాజిక న్యాయం, స్త్రీ విద్య, బహుజ నుల సాధికారిత కోసం జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్రం కోసం పోరా డుతున్న సమయంలో గాంధీ, అంబేద్కర్, అనేక మంది సంఘ సంస్కర్తలు పూలే ఆలో చన విధానాన్ని ప్రశంసించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బలహీన వర్గాలకు తగిన గుర్తింపు లేని సమయంలో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. అలాగే స్థానిక సంస్థల్లో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు కల్పించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. బడుగులను ఎమ్మెల్యే లు, ఎంపీలు, మంత్రులుగా చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు అనేక సంక్షే మ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దీనికి తోడు ఆదరణ వంటి పథకాలను అమల్లోకి తీసుకొచ్చి స్వయం ఉపాధి



కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. గత ఐదేళ్లు జగన్‌రెడ్డి బలహీన వర్గాల నాయకత్వాన్ని అణచివేసే విధంగా టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ రక్షణ చట్టం తెచ్చారన్నారు. 2025-26 ఆర్థిక సంవత్స రానికి బడ్జెట్‌లో సైతం రూ.47 వేల కోట్లు కేటాయించడమే కాకుండా స్వయం ఉపాధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కార్పొరేష న్లు అన్ని బలోపేతం చేసేందుకు నిధులు కేటాయించిన ఘనత చంద్ర బాబుకే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు, వచ్చిన తరువాత అణగారిన వర్గాలకు హక్కుల కోసం పూలే నిస్వార్థంగా కృషి చేశారన్నారు. ప్రతిఒక్కరికి విద్యను అందిం చాలనే లక్ష్యంతో భార్యకు సైతం విద్యను నేర్పించి దేశంలోనే తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా నిలిపారని గుర్తుచేశారు. దేశ చరిత్రలో పూలే పేరు చిరస్మణీయంగా నిలిచి ఉంటుందన్నారు. ఆయన స్ఫూర్తితో టీడీపీ వెనుకబ డిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆయన ఆశయాలను ముందు కు తీసుకెళ్లే బాధ్యత తీసుకుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి పూలే పేదల ఉన్నతికి కృషి చేశారు. ఆయన ఆశ యాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, పాతర్ల రమేష్, గొట్టిముక్కల రఘురాం రాజు, చప్పిడి రాజశేఖర్, ఆళ్ల గోపాలకృష్ణ, ఎ.వి.రమణ, దేవతోటి నాగరాజు, పారా రామకృష్ణ, పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల దందాపై బాధితుల ఫిర్యాదు

### న్యాయం చేయాలని ప్రజావినతుల్లో విన్నపం - అర్జీలు స్వీకరించిన గురుమూర్తి, దూండి రాకేష్

మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ నేతల అరాచకాలపై టీడీపీ కేంద్ర కార్యాల యంలో శుక్రవారం ప్రజావినతుల్లో ఫిర్యాదులు వచ్చాయి. వారి అరాచకాలపై విచారణ జరిపించి న్యాయం చేయాలని వినతిపత్రాలు ఇచ్చారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ అర్జీలు స్వీకరించారు. గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వైసీపీ నేత అక్ర మంగా ఆక్రమించుకుని తమను ఇబ్బంది పెడుతున్నాడని శ్రీ సత్యసాయి జిల్లా గుది బండ మండలం కోంకల్లు గ్రామానికి చెందిన బాధితుడు హనుమేష్ ఫిర్యాదు చేశా డు. దీనిపై కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని.. దయచేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.



తాను పనిచేస్తున్న స్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్‌కు ప్రమోషన్ రావడంతో ఆమె బదిలీపై వెళ్లిపోయిందని.. ఆ టీచర్ ఉద్యోగానికి తనకు అన్ని అర్హతలున్నా గత వైసీపీ ప్రభుత్వంలో సాక్షి విలేఖరి, వైసీపీ నేతలు కలిసి బీసీలు, మైనార్టీలకు దక్కే ఉద్యోగాన్ని ఓసీకి మార్చి తనకు ఉద్యోగం రాకుండా చేశారని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మాతా శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న ఓ బాధితు రాలు ఫిర్యాదు చేసింది. సాక్షి విలేఖరి తన భార్యకు ఆ ఉద్యోగాన్ని ఇప్పించుకు న్నాడని..దీనిపై పోరాడుతున్న తనను స్టేషన్‌లో పెట్టి కొట్టించి కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కోరింది.

తన కూతురు పేరుపై ఉన్న భూమిపై కోర్టులో ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నా.. అక్రమంగా తమ చేలోకి ప్రవేశించి తమపై మేకల వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, వారి భార్యలు కర్రలతో దాడి చేశారని బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరపాలెం గ్రామానికి చెందిన కోడెల నాగమల్లేశ్వరి ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని.. చేలో వేసిన మినప పంటను పూర్తిగా నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తమకు రూ.30 వేలు నష్టం వాటిల్లిందని.. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తన పెద్ద కుమారుడి పేరున పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో ఉన్న 3.52 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కౌలుకు తీసుకుని డబ్బులు అడితే తమను కొట్టారని ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన పిన్నెబోయిన రవణమ్మ ఫిర్యాదు చేసింది. టీడీపీకి చెందిన వారని తమను తిడుతూ కౌలు ఇచ్చేది లేదని పొలంలోకి వస్తే చంపేస్తామని బెదరించారని ఆవేదన వ్యక్తం చేసింది. పిన్నెల్లి అనిమిరెడ్డి తనను జుట్టు పట్టుకుని రోడ్డులో ఈడ్చి కొట్టాడని.. వారి పై సీఐకి వెళ్లి చెబితే ఇంకోసారి స్టేషన్‌లోకి వస్తే తమపైనే తిరిగి చీటింగ్ కేసు పెడ తామని బెదిరించాడని.. దీనిపె ఎన్నో అర్జీలు పెట్టినా తమకు ఎక్కడా న్యాయం జర గలేదని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

గత పంచాయతీ పాలకులు మురుగు కాలువను నిర్మించి ఆ కాలువ గుండా పోయే నీటిని నిర్లక్ష్యంగా పొలాల్లోకి వదిలివేయడంతో పంటలు పండే భూములు చౌడుబారి పనికిరాకుండా పోతున్నాయని గుంటూరు జిల్లా పొన్నూరు మండలం గొల్లమూడిపాడు గ్రామానికి చెందిన తుమ్మల పార్వతి సమస్యను వివరించింది.

తనకు పాయకాపురంలోని రాధా రంగా నగర్‌లో బిల్డింగ్ ఉందని, సదరు బిల్డింగ్ తాలుకా కాగితాలు గాంధీ కోఆపరేటివ్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.12 లక్షలు తీసుకున్నానని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన పుల్లయ్య తెలిపారు. తిరిగి మొత్తం చెల్లించాక కూడా బ్యాంకు వారు తమ ఇంట్లోకి వచ్చి అద్దెకు ఉన్న వారిని కులం పేరుతో తిట్టి సామగ్రి బయట పడేశారని, బ్యాంక్ మేనేజర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

# సామాజిక న్యాయానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

- జ్యోతీరావు పూలే ఆశయాలకు అనుగుణంగా పాలన
- సంఘ సంస్కర్త పూలే విగ్రహావిష్కరణ సభలో మంత్రి డోలా

సింగరాయకొండ (చైతన్యరథం): మహాత్మా జ్యోతిరావు పూలే చూపిన మార్గంలో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో శుక్రవారం జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు డోలా, సత్యకుమార్ యాదవ్, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి డోలా మాట్లాడుతూ నాటి సమాజంలోని సాంఘిక దురాచారాలపై పూలే పోరా టం చేశారన్నారు. మహిళా విద్య కోసం పూలే దంపతులు ఎనలేని కృషి చేశా రని గుర్తు చేశారు. పూలే ఆశయాలకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఏప్రిల్ మాసం సంఘ సంస్కర్తలు, సామాజిక విప్లవకారుల మాసం అన్నారు. ఈ నెలలోనే జగ్జీవన్ రామ్, అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చంద్రబాబు నాయుడు వంటి వారు జన్మించారని గుర్తు చేశారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కృషి



చేస్తోందన్నారు. జగన్ 56 కార్పొరేషన్లు పెట్టి పైసా కేటాయించకుండా బీసీలను మోసం చేశారని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు నిత్య కృత్యంలా మారిన చీకటి రోజులను జనం మర్చిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతగానో పాటుపడుతోందని మంత్రి డోలా తెలిపారు.

# పూలే ఆదర్శంగా రాష్ట్రంలో కస్తూర్బా బాలికా విద్యాలయాలు

- అద్దంకి నియోజకవర్గ పరిధిలో రూ.3 కోట్లతో రెండు విద్యాలయాల నిర్మాణం
- బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



బాపట్ల (చైతన్యరథం): దశాబ్దాల క్రితమే మహిళల విద్య కోసం అలుపెరగని పోరాటం చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయిల ఆదర్శంగా రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, ఏల్చూరులలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు మంత్రి గొట్టిపాటి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అద్దంకి నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.3 కోట్లతో రెండు బాలికల విద్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాలికల విద్య పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు స్పష్టం చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే విద్యాలయాల నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థినిలకు అందుబాటులోకి తీసుకు వస్తామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పాఠశాల విద్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం విద్యను పేదలకు దూరం చేయడమే కాకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. ప్రాథమిక హక్కు అయిన విద్యను అందరికీ అందించే లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళికలు రూపొందించారని వివరించారు.

### రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ...

రాయితీ వ్యవసాయ పనిముట్లతో అన్నదాతకు ఆర్థిక చేయూత లభిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు ప్రజా వేదిక నిర్వహించిన మంత్రి... ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా వేదిక ద్వారా వచ్చిన విజ్ఞప్తులును వెంటనే పరిష్కరించాలని.. అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక రైతులకు వ్యవసాయ పరికరాలను మంత్రి గొట్టిపాటి అందజేశారు.

## గిరిజన ప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

●తారు రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి



కురుపాం (చైతన్యరథం): కురుపాం గ్రామీణం: పార్వతీపురం మన్యం జిల్లా ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామాలన్నింటికీ ప్రాధాన్యత క్రమంలో పక్కా రహదారి సౌకర్యం కల్పిస్తామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కురుపాం మండలం జి.శివడ పంచాయతీలో రూ.90లక్షలతో, రాముడుగూడ నుంచి కీడవాయి వరకు రూ.2కోట్లతో నిర్మించిన తారు రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు లేక గిరిజనులు పడుతున్న కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఇంకా రోడ్లు లేని గిరిజన గ్రామాలు కొన్ని ఉన్నాయని, వాటి కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన విధంగా గిరిజన ప్రాంతాల్లో ఇక డోలీ మోతలు కనిపించవన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి, గిరిజన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే- 33సీడీపై జామి వద్ద ఇంటర్ ఛేంజ్ రింగ్ రోడ్డు పూర్తయింది. చుట్టూ పచ్చని పొలాలు మధ్యలో నల్లగా సరళరేఖలా ఉన్న హైవే పైకి చేరాలన్నా, రెండు వైపులకు వెళ్లాలన్నా ఈ ఇంటర్ ఛేంజే ఆధారం. గంట్యాడ, జామి, ఎస్.కోట మండలాల రాకపోకలకు ఉద్దేశించిన ఈ రింగ్ రోడ్డు ప్రస్తుతం ఆ ప్రాంత ముఖచిత్రాన్నే మార్చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ నుంచి విశాఖపట్నం వరకు 6 వరుసలుగా నిర్మిస్తున్న హైవేతో ఆయా మండలాలకు కొత్త కళ వచ్చింది. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలం కొర్లాం నుంచి కొత్తవలస మండలం కంటకాపల్లి వరకు చేపట్టిన రహదారి పనులను పూర్తి చేసినట్లు రహదారి ఇన్‌ఛార్జి రాజశేఖరం వెల్లడించారు.



## కుసుమగూడ ఎంపీయూపీ పాఠశాలను సందర్శించిన దొన్నుదొర



విజయనగరం (చైతన్యరథం): కుసుమగూడ ఎంపీయూపీ పాఠశాలను ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర సందర్శించారు. దుంబ్రిగూడ మండలం సాగర పంచాయతీ కుసుమగూడ ఎంపీయూపీ పాఠశాలను సందర్శించిన అరకువేలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అనంతరం దొర పరిశీలిస్తూ విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు అడిగితెలుసుకున్నారు. ఉపాధ్యాయులు దొర దృష్టికి తీసుకొస్తూ పాఠపడిన భవనం శిధిల దశలో ఉన్నాయని మరియు పాఠశాల ప్రహరీ గోడ మంజూరు చేయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన దొర సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాగర ఎంపీటీసీ వంతాల దేవదాస్, అరకువ్యాలీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, దుంబ్రిగూడ మండల అధ్యక్షులు సుబ్బారావు, ఎంపీటీసీ మండ్య గురు స్వామి, మాజీ ఎంపీపీ దన్నేరావు, రుడి త్రినాథ్, మాజీ సర్పంచ్ ఆనంద్, అరకు మాజీ సర్పంచ్ చటారి వెంకటరావు, పాడి చందు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కొర్ర నాగరాజు, భీమన్న బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ఇప్పటికైనా మారు... సూచించిన ఎంపీ అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పోలీసులపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.. జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా తన మాట తీరును మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి ఇలాంటి భాష వాడటం చాలా బాధాకరమని అన్నారు. తెలుగుదేశం పార్టీకి ఒక నిబద్ధత, విలువలు ఉన్నాయని, ప్రజల పట్ల తన బాధ్యతను విస్మరించి జగన్ మాట్లాడారని అప్పల నాయుడు విమర్శించారు. పోలీస్‌లను సైతం వదలకుండా చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు. గత ఎన్నికలే ప్రజల్లో వైఎస్సార్‌సీపీ పట్ల ఉన్న భావానికి ఉదాహరణ అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి భారీ మెజారిటి ఇచ్చిన విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. కష్టంలో ఉన్న రాష్ట్రానికి కేంద్రం సహకారం అందిస్తూ ముందుకు వెళ్లేందుకు సహరిస్తోందన్నారు. ఒక ఎమ్మెల్యేగా, మాజీ ముఖ్యమంత్రిగా అభివృద్ధి కోసం సలహాలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. వైసీపీ పాలనలో డీజీపీ స్థాయి వ్యక్తి సైతం మీ కోర్టులో చేతులు కట్టుకుని నిలబడే పరిస్థితికి తెచ్చారని విమర్శించారు. జగన్..మీరు చేస్తున్న శవ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సయితం చంద్రబాబు అంటే అభివృద్ధి, నమ్మకానికి బ్రాండ్ అని చెబుతున్నారని, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. భయం, అసూయతో జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నమ్మకం, విశ్వాసం అని జగన్ చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారని.. తరువాత బెంగుళూరు వెళ్లిపోతున్నారని కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు.

## నేడే ఇంటర్ ఫలితాలు... ఉదయం 11 గంటలకు విడుదల



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2025 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలు నేడు (శనివారం) విడుదల కానున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ఫలితాలను ఏప్రిల్ 12, 2025 శనివారం ఉదయం 11 గంటల నుంచి చూసుకోవచ్చు. విద్యార్థులు తమ ఫలితాలనుhttps://resultsbie.ap.gov.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అలాగే సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ సర్వీస్ ద్వారా కూడా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం 9552300009 అనే నెంబర్‌కు "%నఅ%" అని మెసేజ్ పంపితే, మన మిత్ర సేవ ద్వారా తక్షణమే ఫలితాలను పొందవచ్చు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్, "ఇంటర్మీడియట్ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు. మీరు గడిపిన కష్టసాధ్యమైన రోజు కచ్చితంగా ఫలించాలి. రేపటి ఫలితాలు మీ ఉజ్వల భవిష్యత్తుకు మార్గం కావాలని ఆశిస్తున్నాను" అని ట్వీట్ చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడంలో ఈ ఫలితాలు కీలకమైన మైలురాయి అవుతాయని భావిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అంతా ఆసక్తిగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. క్రమశిక్షణ, సమయం పట్ల నిబద్ధతతో చదివిన విద్యార్థులకు ఇది విజయం సాధించే సమయం. అన్ని విద్యార్థులకు శుభాకాంక్షలు! మీ కృషికి న్యాయం జరిగి, మంచి ఫలితాల ద్వారా భవిష్యత్తు ద్వారాలు తెరుచుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం.

## పగలు ఎండ... రాత్రి వర్షం... రెండు తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర వాతావరణం



అమరావతి (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. పగలంతా ఎండ మండిపోతుంటే.. సాయంత్రం అయ్యే సరికి వాన దంచికొడుతోంది. అటు ఏపీలోనూ ఇటు తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. ఎండ - వానతో పాటు ఈదులు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వానకి తోడు గాలిదుమారానికి చేతికొచ్చిన పంట నేలపాలవుతోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడుతోంది. వచ్చే మూడు రోజుల్లో ఏపీలో తేలికపాటి వర్షాలు ఉంటాయంటోంది వాతావరణ విభాగం. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, చిత్తూరు, తిరుపతి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందంటున్నారు వాతావరణ విభాగం అధికారులు. అయితే కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఇటు తెలంగాణలో మాత్రం మరో రెండు రోజుల పాటు మోస్తరు వానలు ఉంటాయంటున్నారు. ఇదిలా ఉంటే.. కొన్నిచోట్ల వానలు దంచికొడుతుంటే.. ఇంకొన్ని ప్రాంతాల్లో పగటిపూట ఎండలు మంటపుట్టిస్తున్నాయి. తెలుగురాష్ట్రాల్లో హై టెంపరేచర్లు నమోదవుతున్నాయి. ముందుగా నిన్న ఏపీలో ఉష్ణోగ్రతల విషయానికొస్తే.. ప్రకాశం జిల్లా నందనమారేళ్లలో అత్యధికంగా 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక తిరుపతిలోని వెంకటగిరిలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు, కడపజిల్లా ఒంటిమిట్టలో 41 డిగ్రీలు, నంద్యాలజిల్లా దొర్నిపాడులో 40.8 డిగ్రీలు, విజయనగరం జిల్లా ధర్మవరంలో - 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణ విషయానికొస్తే.. ప్రధానంగా ఆదిలాబాద్‌జిల్లాలో మాడు పుట్టింటే ఎండలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆదిలాబాద్‌లో ఏకంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్‌లో 40.8 డిగ్రీలు, మెదక్‌లో 39.8 డిగ్రీలు, ఖమ్మంలో 38.6 డిగ్రీలు, రామగుండంలో 37.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**ఏపీలో నేటి నుంచి వడగాల్పులు**

రాష్ట్రవ్యాప్తంగా 66 మండలాల్లో నేడు (శనివారం) వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు సాధ్యమైనంతవరకు ఎండకు దూరంగా ఉండాలని, ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, గ్లూకోజు, నిమ్మరసం, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలంటూ సందేశాన్ని పంపించింది.

**మండలాల్లో వడగాల్పుల ప్రభావం:** కృష్ణా జిల్లా గన్నవరం, కంకిపాడు, పెదపారుపూడి, ఉంగుటూరు, ఉయ్యూరు మండలాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. అల్లూరి-1, కాకినాడ-6, కోనసీమ-8, తూర్పుగోదావరి-3, పశ్చిమగోదావరి-1 ఏలూరు-7, కృష్ణా-9, ఎన్టీఆర్-4, గుంటూరు-14, బాపట్ల-7, ప్రకాశం-1 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నెల 13 తేదీన 10 మండలాల్లో తీవ్రంగా, 108 మండలాల్లో స్వల్పంగా వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ తెలిపింది.

**41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు:**

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం కడప జిల్లాలోని అట్లూరులో అత్యధికంగా 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఆ తర్వాత ప్రకాశం జిల్లాలోని గుంటుపల్లిలో 41.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా దొర్నిపాడు, పల్నాడు జిల్లా రావిపాడు 40.9 డిగ్రీలు, నెల్లూరు జిల్లా అయ్యపరెడ్డిపాలెంలో 40.7 డిగ్రీలు, ఏలూరు జిల్లా కామవరపుకోట, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.6 డిగ్రీలు, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో 25 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ వెల్లడించింది.

# బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదే

## •మహాత్మజ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో మంత్రి రామానాయుడు




పాలకొల్లు (చైతన్యరథం): దేశ చరిత్రలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. టీడీపీ కల్పించిన రిజర్వేషన్లు అధికారంలోకి వచ్చిన జగన్ 24 శాతానికి తగ్గించి దగా చేశారని, మోసంతో బీసీల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పాలకొల్లులో శుక్రవారం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా 50 మంది గీత కార్మికులకు మోకులు, పండ్లు, కూరగాయల చిరు వ్యాపారులకు తోపుదు బండ్లు, నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లును మంత్రి రామానాయుడు ఉచితంగా అందజేశారు. బీసీ, కార్పొరేషన్ ద్వారా రూ 3.50 కోట్ల సబ్సిడీ రుణాల చెక్కును అందజేయడం జరిగింది. అంతకు ముందు స్థానిక గాంధీబొమ్మల సెంటర్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు జ్యోతిరావు పూలే ఆశయాల కనుగుణంగానే బీసీల అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిచ్చారన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించాలని చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి వేలాదిమంది పదవులు పొందేందుకు టీడీపీయే కారణమన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి రాజకీయ అవకాశాలు కల్పించిన తెలుగుదేశం పార్టీకి మాత్రమే బీసీలపై పేటెంటి హక్కు ఉందన్నారు. బీసీ అంటే తెలుగుదేశం, తెలుగుదేశం అంటే బీసీ అనే విధంగా రాష్ట్రంలో పార్టీ గుర్తింపు తెచ్చుకుందన్నారు. తెలుగుదేశం అంటే యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు, కేఈ కృష్ణమూర్తి గుర్తుకు వస్తారని, అదే వైసీపీ అంటే సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి, చెవిరెడ్డి గుర్తుకు వస్తారని చెప్పారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ పాలనలో బీసీల రిజర్వేషన్ తగ్గించడంతో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 16వేల పోస్టులు బీసీలు కోల్పోయారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నేడు మంత్రిగా ఉన్నానంటే పాలకొల్లు నియోజకవర్గం లో ఎస్సీ, బీసీ లేనని.. ఈ రుణం తీర్చుకునే విధంగా పనిచేస్తున్నానని మంత్రి రామానాయుడు తెలిపారు.

# ముఖ్యమంత్రి దృష్టికి కోకో రైతుల సమస్యలు

## • చొరవ చూపిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు (చైతన్యరథం): కోకో పంటకు సరైన గిట్టుబాటు ధర రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఏలూరు జిల్లాకు చెందిన రైతులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చొరవతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో జీరో పావర్టీ - పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసేందుకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతులు సభ వేదిక వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అనుమతించకపోవడంతో సభ వేదిక బయట నిరీక్షిస్తున్న రైతులు ఎంపీ మహేష్ కుమార్ కంటపడ్డారు. కోకో రైతుల వద్దకు వెళ్లిన ఎంపీ మహేష్ కుమార్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోకో రైతుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రైతులు నేరుగా కలిసేందుకు చొరవ చూపించారు. సమావేశం ముగించుకుని హెలిప్యాడ్ వద్దకు బయలుదేరిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను తన వద్దకు పిలిపించుకొని మాట్లాడారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకో సాగు చేస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో కోకో సాగు విస్తీర్ణం ఉందని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టి కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నామని, గత సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్ లో కిలో కోకో గింజలకు రూ.1040/- వరకు ధర వచ్చిందని, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ లో కిలో కోకో గింజలకు రూ.700కు పైగా ధర ఉన్నా ప్రస్తుతం కోకో గింజలు కొనుగోలు కంపెనీలు ఆ ధర చెల్లించడం లేదని, పాత, కొత్త గింజల పేరుతో కోకో రైతులను కంపెనీలు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఇక్కడ కంపెనీలు సిండికేట్గా మారి కిలో కోకో గింజలకు రూ. 480 నుండి రూ. 550 వరకు ధర ఇస్తున్నాయని, అన్ సీజన్ గింజలను రూ. 200 నుండి రూ. 240 వరకు కొనుగోలు చేస్తున్నారని, ఇంతకు ముందు లేనివిధంగా గ్రేడింగ్ విధానం తీసుకొచ్చి తమను ఇబ్బందులు పెడుతున్నారని రైతులు తమ సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వివరించారు. కోకో రైతుల సమస్యలను ఓపికతో విన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమను ఆదుకునేందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చొరవ చూపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం ఆకాంక్షించిన వ్యక్తి పూలే

## •ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): సమాజంలో చైతన్యం తీసుకుని రావడం ద్వారా స్ఫూర్తి నింపిన మహాత్మా జ్యోతిరావ్ పూలే నాడు వేసిన ప్రతి అడుగు నేడు బడుగు బలహీన వర్గాలు వారు ఉన్నతమైన స్థానంలో నిలవడానికి కారణం అనడంలో ఎటువంటి సందేహం లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక గోదావరి గట్టు సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వం వేడుకగా 198వ జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలు నిర్వహించారు. పూలే విగ్రహానికి వారంతా పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్ల అభ్యుదయభావాల నుంచి స్ఫూర్తి పొందడం కోసం వారిని స్మరించు కోసం ఇరువురి చిత్రపటాలు ఇక్కడ ఏర్పాటు చేసి స్మరించుకోవడం జరిగిందన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు తొలగించడానికి, నేడు సమాజంలో, వేదికలపై తగిన గౌరవ మర్యాదలు వస్తున్నాయంటే అందుకు బీజం వేసిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అన్నారు. విద్య, కుల, లింగ వివక్ష వంటి అనేక అసమానతలు ఉండేవని, వాటిని తొలగించే క్రమంలో ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేకు చదువు చెప్పించి, ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. చెయ్యాలని సంకల్పం ఉన్నా కొద్దిమందే చెయ్యగలుగుతారని, అటువంటి వారినే మహాత్మాగా పిలుచుకుంటామని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తుల జన్మదినాలు, వర్ధంతులు అధికారికంగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయంటే వారి స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు ఆదర్శం కావాలని అనే సంకల్పం ఒక్కటే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కూడిపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నల్లం శ్రీను, ఆర్యపురం బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, నాయకులు నయనాల కృష్ణారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్, కే తిలక్ కుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక్ మున్సిపల్ ఈఈ, మాధవి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు ముత్యాల సుబ్బారావు, పి రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బిసి అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావుపూలే : ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు కొనియాడారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం ఉదయం ఘనంగా జరిగాయి. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ... ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే అని ప్రసంసించారు. చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు అని చెప్పుకొచ్చారు. సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన, స్త్రీ,పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని టీడీపీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస బాబా, కాకినాడ రూరల్ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరావు, తుమ్మల రమేష్, ఎస్ సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ, గదుల సాయిబాబా, చింతలపూడి రవి, వనపర్తి బద్రి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



ఏలూరు (చైతన్యరథం): నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం హెలికాప్టర్ ద్వారా ఆగిరిపల్లి చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర బి.సి. సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత, నూజివీడు బ్రాండ్ అయిన మామిడిపండ్ల బుకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్ కుమార్, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి. కిషోర్ కుమార్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారావు, మాజీ శాసనసభ్యులు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి రామకృష్ణ, పీతల సుజాత, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ప్రభృతులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

# జ్వరాలతో అల్లాడుతున్న ప్రత్తికోళ్ల లంక

ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ల లంక జ్వరాలతో అల్లాడుతోంది. గతంలో ఎన్నడూ లేనట్టుగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా జ్వరం ఆరంభమై తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, వాపు వంటి లక్షణాలతో జనం ఆందోళన చెందుతున్నారు. వయ స్సుతో సంబంధం లేకుండా జ్వరం, తల నొప్పి, గొంతునొప్పి లక్షణాలతో బాధపడుతున్నారు.

# చంద్రబాబునాయుడు పిలుపుతో స్వచ్ఛంద్ర వైపు అడుగులు : గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో స్వచ్ఛంద్ర వైపు అడుగులు వేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో తమిళనాడు మార్కంటైల్ బ్యాంక్ వారి సహకారంతో సుమారు 50 పుష్ కార్ట్లు అందజేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2047 స్వచ్ఛంద్ర వైపు అడుగులు వేస్తున్నదని, ఇందుకోసం పీ4 విధానంలో భాగంగా వివిధ సంస్థలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ సమర్థవంతంగా చేపట్టి పారిశుధ్యం మెరుగుపరుస్తామని చెప్పారు. నగరాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ముందుకు వస్తే సమాజంలో పేదరికం ఉండదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

**జ్యోతిరావు పూలే జయంతి వేడుకలలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరులో పలు చోట్ల జరిగిన మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత నగరపాలెం ట్రావెల్స్ బంగ్లా, మున్సిపల్ కార్పొరేషన్ మరియు కలెక్టరేట్ లోని శంకరన్ హాల్ నందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలో పాల్గొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

**మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**

గుంటూరు నల్లపాడు రైల్వే గ్రౌండ్స్ నందు పరుచూరి వీర రాఘవరావు మెమోరియల్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఇన్‌ఛార్జ్ మేయర్ షేక్ సజీలలు ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే గళ్ళా మాధవి, సజీలాలు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# జ్యోతిరావుపూలెకి నివాళులర్పించిన గుంటూరు జిల్లా బీసీ సెల్ నేతలు



గుంటూరు (చైతన్యరథం): శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలె జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మరియు జిల్లా నాయకులు హాజరై జ్యోతిరావు పూలె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ... జ్యోతిరావు పూలే భారతీయ సామాజిక కార్యకర్త, అపరమేధావి... కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త, బడుగు, బలహీన వర్గాల ప్రజలలో ఆత్మస్థైర్యం కల్పించిన ధీరుడు. అంటరానితనం, మహిళా లోకం కృషి కోసం, బిసిల అభివృద్ధి కోసం పాటుపడిన ఏకైక శక్తి... తన కోసం తాను జీవించకుండా, తాను పుట్టిన జాతి జనుల విముక్తి కోసం జీవించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే. లింగ వ్యవస్థ, జాతి వివక్ష లేని సమసమాజ స్థాపన కొరకు కృషి చేసిన మహనీయుడు... మొట్టమొదటిగా స్త్రీ విద్యకు బాటలు వేసిన ఘనుడు జ్యోతిరావు పూలే. తన సతీమణి సావిత్రిబాయి పూలె ద్వారా బాలికలు చదువుకోవడానికి మొట్టమొదటగా పాఠశాలలు స్థాపించి వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల సాధికారత కోసం పూలే గారు పరితపించారు. బిసిల కోసం రాష్ట్రంలో పుట్టిన పార్టీ దేశంలోనే మొట్టమొదటి రాజకీయ పార్టీ టీడీపీ. తెలుగుదేశం పార్టీలో బిసిలకు ఇచ్చిన ప్రాధాన్యత ఇంతవరకు ఏ పార్టీలోనూ ఇవ్వకపోవడం సిగ్గుచేటు. జ్యోతిరావు పూలె ఆశయాలను కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ ముందుకు తీసుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుఖవాసి శ్రీనివాసరావు, సింహాద్రి కనకాచారి, మల్లె ఈశ్వరరావు, రావిపాటి సాయికృష్ణ, ధూళిపాళ్ల ఏసుబాబు, మాదాల చినకొండలరావు, గట్టి శ్రీనివాస్, జంపని నాగేశ్వరావు, బొబ్బిలి రామారావు, గొడుగు శంకర్, బెల్లంకొండ సురేష్, షేక్ చిన్నబాజి, మన్నవ కోటేశ్వరరావు, గుంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ మెట్రో రైలులో మరో అడుగు - భూసేకరణకు అధికారుల చర్యలు షురూ



విజయవాడ (చైతన్యరథం): మెట్రో రైలు ప్రాజెక్ట్ రూపకల్పనకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అవసరమైన భూసేకరణకు సంబంధించిన అంశాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గన్నవరం, కేసరపల్లిలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి విజయవాడ మెట్రో ప్రాజెక్ట్ చీఫ్ మేనేజర్ జీపీ రంగారావు పర్యటించారు. బస్టాండ్, హెచ్ సీఎల్, కేసరపల్లి కూడలిలో 12:42 మీటర్లతో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లకు అవసరమైన భూసేకరణ విషయాలపై సమాలోచనలు చేశారు. ప్రాజెక్ట్ మొదటి కారిడార్‌లో 26 కిలోమీటర్ల ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్ పీఎన్‌బీఎస్ నుంచి గన్నవరం వరకు ఉండనుంది. ప్రాజెక్ట్ రూపకల్పనలో భూసేకరణకు గాను మొత్తం రూ.1,152 కోట్లు అవసరమవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. తొలిదశలో చేపట్టబోయే మెట్రో లైన్‌కు సేకరించే 82.66 ఎకరాల్లో రైల్వే సహా కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలం 1.03 ఎకరాలుగా ఉంది. అయితే దీనిలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి 4.86 ఎకరాలు, ప్రైవేటు భూమి ఏకంగా 76.77 ఎకరాలుగా ఉండటం గమనార్హం. ప్రతి 15 రోజులకు సమీక్ష: అదే విధంగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్) ఎండీ ఆధ్వర్యంలో రెండు జిల్లాల కలెక్టర్లతో ప్రతి 15 రోజులకోసారి సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. వీలైనంత వేగంగా విజయవాడ మెట్రో పనులను ప్రారంభించే విధంగా చర్యలను చేపడుతున్నారు. తాజాగా భూసేకరణకు మెట్రో రైలు కార్పొరేషన్ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. రామవరప్పాడు చౌరస్తా నుంచి గన్నవరం వరకు జాతీయ రహదారి మీదుగా మెట్రో లైన్ వస్తోంది. ఈ మార్గంలోపై వంతెనల నిర్మాణం ఉండడంతో ఒకదానిపై మరొకటి మెట్రో డబుల్ లైన్‌లో వస్తాయి. అందుకే ఎన్‌హెచ్‌ఏఐ, మెట్రో కలిసి ఒకేసారి ప్రణాళికను రూపొందించుకుని ముందుకెళ్లనున్నాయి.

# వైసీపీ నేత గోరంట్ల మాధవ్‌కు 14 రోజుల రిమాండ్

గుంటూరు (చైతన్యరథం): గోరంట్ల మాధవ్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. గుంటూరు ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి ఈనెల 24 వరకు గోరంట్ల మాధవ్‌కు రిమాండ్ విధించారు న్యాయమూర్తి. మాధవ్‌తో పాటు మిగతా ఐదుగురికి 14 రోజుల రిమాండ్ విధించారు. గోరంట్ల మాధవ్ సహా నిందితులు నెల్లూరు జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు. వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం గుంటూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ గోరంట్ల మాధవ్ అరెస్ట్ వివరాలను విశదీకరించారు. వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో చేబ్రోలు కిరణ్ కుమార్‌ను అరెస్ట్ చేశామని.. ఆ క్రమంలో పోలీసుల అదుపులో ఉన్న అతడిపై చుట్టుగుంట వద్ద గోరంట్ల మాధవ్ దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

# గన్నవరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడతా : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడతానని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో శుక్రవారం సాయంత్రం పలు అభివృద్ధి పనులను యార్లగడ్డ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... అరాచకాలు అక్రమాలతో అల్లాడిన గన్నవరం ప్రజలకు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం తర్వాత ప్రశాంతత లభించిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తాను ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. మల్లవల్లి పారిశ్రామివాడలో త్వరలో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని చెప్పారు. నియోజవర్గంలో 15 వేల మంది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని ఆమెకు ఆమెను నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులు మొత్తం రూ.1.80కోట్ల ఖర్చుతో నూతనంగా నిర్మించిన పాత గన్నవరంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయం బజార్ రోడ్, చెంచుల కాలనీ, వీనస్ రోడ్లు, మండల ఆఫీసు ప్రహరీ గోడ, శ్రీనగర్ కాలనీ రోడ్లులను ప్రారంభించిన యార్లగడ్డ... రాయనగర్లో ఎన్టీఆర్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రీచ్ రోడ్డు ప్రారంబించిన తదుపరి గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటిపరిష్కారానికై అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ లు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కృష్ణ మిల్క్ యూనియన్ డైరెక్టర్ పాలడుగు నాని, గ్రామ పార్టీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, జాస్తి ఫణి,తదితరులు పాల్గొన్నారు.

# మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే

## •ఎంపి కేశినేని కార్యాలయంలో పూలే 199వ జయంతి కార్యక్రమం

విజయవాడ (చైతన్యరథం): దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించి మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలతో నలిగిపోతూ అణగారిన బడుగు బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావు పూలే కొత్తదారి చూపించటంతో పాటు, చేయి పట్టి నడిపించారన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని చాటిచెప్పారని వారి సేవలను కొనియాడారు.. భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమానికి బీజం వేసిన మొదటి మహోన్నతుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. అంబేద్కర్, పూలే గారి ఆదర్శాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ అధికారాన్ని కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనాల కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.



# అందరికీ ఆదర్శం జ్యోతీరావు పూలే జీవితం




కుప్పం, (చైతన్యరథం): మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శమని ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పీఎస్ మునిరత్నం స్పష్టం చేశారు. శుక్రవారం కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన వ్యక్తిమహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని, స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే అని, సమసమాజ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తితో బీసీల అభ్యున్నతికి ఆది నుంచీ కృషిచేస్తూ బీసీల పార్టీగా పేరుగాంచింది తెలుగుదేశం పార్టీ అని అన్నారు. పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజకుమార్, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి సురేష్ బాబు, కుప్పం నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు నరేష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మురళి, వెంకటరమణ, సతీష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఒంగోలులో..

**ఒంగోలు:** నగరంలో రాంనగర్, కొత్త మార్కెట్‌లో జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు మంత్రి వర్యులు సత్య కుమార్, స్వామి, కలెక్టర్ అన్సారీయా, నూకసాని బాలాజీ మేయర్ సుజాతతో కలిసి నివాళులు అర్పించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు. తదుపరి ప్రకాశం భవన్‌లో జ్యోతిబా పూలె జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు వ్యక్తిగత రుణాలను పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### రిమ్స్ హాస్పిటల్ లో

**ఒంగోలు:** రిమ్స్ హాస్పిటల్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్, ఒంగోలు శాసనసభ్యులుదామచర్ల జనార్ధన రావు, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి పూలమాలలు వేశారు.









# అకాల వర్షం... అన్నదాతకు అపార నష్టం

**తడిసిన పదివేల పుట్ల ధాన్యంకష్టాల్లో ఉన్న రైతుకు అండగా ఉంటాం**

**ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

సర్వేపల్లి, (చైతన్యరథం): అకాల వర్షాలకు వెంకటాచలం మండలం ఇస్కపాళెం, ఈదగాలి, తాటిపర్తిపాళెం, పూడిపర్తి గ్రామాల పరిధిలో అన్నదాతకు భారీ నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కుదేలైన రైతులకు ధైర్యం చెప్పారు. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోవడం బాధాకరమన్నారు. ఒక్కో గ్రామంలో వేలాది పుట్లు తడిచిపోయాయన్నారు. ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతులకు ఖర్చులు రెట్టింపవుతున్నాయన్నారు. ధాన్యం కూడా రంగుమారి తక్కువ ధరకు అడిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# 303 పనులకు పూర్తయిన 291

నెల్లూరు, (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గంలో 303 అభివృద్ధి పనుల పురోగతిపై నేటి సాయంత్రం 6 గంటలకు అధికారులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మొత్తం 303 పనుల్లో 291 పనులు కొన్ని పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయని, కొన్ని క్యూరింగ్ దశలో ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి నివేదిక అందజేశారు. కేవలం 12 పనులు సాంకేతిక సమస్యల వల్ల ఇంకా ప్రారంభం కాలేదని 3 రోజుల్లో వాటిని కూడా ప్రారంభిస్తామని అధికారులు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వివరించారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వ్యవస్థల విధ్వంసకుడు జగన్ రెడ్డి

**వంచన పుస్తకాన్ని ఆవిష్కరించిన కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి**

కావలి, (చైతన్యరథం): ప్రభుత్వ వ్యవస్థల్ని వంచించిన ఘనుడుగా వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో వ్యవస్థల విధ్వంసం పై సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ డి ఉదయ్ కుమార్ రచించిన “వంచన” పుస్తకాన్ని ఆయన శుక్రవారం కావలిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి ఉన్నప్పుడు వ్యవసాయం, రైతులపై వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు చాలా జుగుప్సాకరంగా వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించిందన్నారు. రైతులకు ఉప యోగపడే పథకాలు అటకెక్కించాడని దుయ్యబట్టారు. ఆర్బీకే కేంద్రాలంటూ భక్షక కేంద్రాలను సృష్టించి రైతులు పండించిన పంటను దోచుకున్నారన్నారు. దోపిడీదారులను నియమించుకుని దోచుకున్న దాంట్లో తాడేపల్లి ప్యాలెస్ కు కమీషన్లు వచ్చేలా చేసుకున్నారన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పరుగులు పెట్టాయని, ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు రూ.1373 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా కేవలం రూ.642 కోట్లు మాత్రమే ఖర్చు చేసినా పనులు పూర్తి కాలేదన్నారు. దళితులపై దాడులు, ఉద్యోగలేమితో యువకులు, అణగారిన వర్గాలకు ఆకలి కష్టాలు, అమరావతి విధ్వంసం.. ఇవీ జగన్ తన పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టిన దుర్మార్గాలని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దుయ్యబట్టారు. రాష్ట్రంలో సాగించిన విధ్వంసంపై సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ ఉదయ్ “వంచన” పేరుతో పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ లీగల్ సెల్ ప్రెసిడెంట్ రాజకుమార్ చౌదరి, రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి చౌదరి , స్పెక్ట్రమ్ గ్రూప్ అధినేత డాక్టర్ సూరినేని మోహన్ పాల్గొన్నారు.



# వ్యవసాయ పనిముట్ల పంపిణీ

**పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

వెంకటగిరి, (చైతన్యరథం): వెంకటగిరి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో రైతులకు వ్యవసాయ పనిముట్లను వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు, డక్కిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు, డక్కిలి మండల అధ్యక్షులు, మాజీ చైర్మన్, తిరుపతి పార్లమెంట్, పట్టణ కమిటీ సభ్యులు, అగ్రికల్చర్ అధికారులు, అనధికారులు, తెలుగుదేశం-జనసేన - బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




# టీడీపీ పాలనలోనే పూలే సిద్ధాంతాల అమలు

## ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

ఒంగోలు, (చైతన్యరథం): మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు నగరంలో నిర్వహించిన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీన వర్గాలు, కాపు లబ్దిదారుల మెగా రుణ మేళా, యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటిడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ “మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లాంటి మహానుభావుల ఆశయాలు సామాజిక న్యాయం, సమానత్వానికి మార్గదర్శకాలన్నారు. వారి సిద్ధాంతాలను అనుసరించడం ద్వారా మాత్రమే సమాజంలో సుస్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చున్నారు. మహిళా సాధికారత, వెనుకబడిన వర్గాల విద్యా అవకాశాలు, ఆర్థిక సహాయ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ పని చేస్తోంది” అని తెలిపారు. రెండు వందల సంవత్సరాల క్రితం పుట్టిన జ్యోతిరావు పూలే తన జీవితాన్ని సమాజ సంస్కరణలకు అంకితం చేశారన్నారు. ఆయన చేసిన పోరాటం ఫలితంగానే నేడు అనేక సామాజిక అసమానతలను అధిగమించగలిగాము. ఆనాడు భారత సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి పూలే తన భార్య సావిత్రిబాయి పూలే తోడ్పాటుతో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూలే ఆశయాలను అనుసరించి అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాలకు కట్టుబడి ముందుకు సాగుతోంది. 2019లో జ్యోతిరావు పూలే స్మారక భవన నిర్మాణానికి రూ.5 కోట్లను కేటాయించిన ప్రభుత్వం, సామాజిక న్యాయ పరిరక్షణకు, సామాజిక సమతుల్య అభివృద్ధికి కృషి చేస్తోందిదన్నారు. జిల్లా అధికారులు పూలే విగ్రహం, స్మారక భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించవలసిన అవసరం ఉందని డాక్టర్ బాలాజీ సూచించారు. విద్య, సాంస్కృతిక సమీకరణ ద్వారా మాత్రమే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ మెగా రుణ మేళా కార్యక్రమం, వారి జీవితాల్లో కొత్త ఆశలు రేకెత్తించే మైలురాయిగా నిలుస్తుందని డాక్టర్ బాలాజీ అభిప్రాయపడ్డారు.




# పూలే ఆశయ సాధకుడు సీఎం చందబాబు

నెల్లూరు, (చైతన్యరథం): వైసీపి పాలనలో పూలే ఆశయాలకు తూట్లు పొడిచారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధర్మవరపు సుబ్బారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో దేశంలో అన్ని రాజకీయ పార్టీలు నేడు బీసీల గురించి మాట్లాడాల్సిన పరిస్థితి కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. వైసీపీ 26 వేల దొంగ కేసులు బీసీలపై బనాయించిందన్నారు. బీసీల రక్షణకు బలమైన చట్టాలు టీడీపీ అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బీసీల మనస్సుల్లో చెరగని ముద్రవేశారన్నారు. పాల్గొన్నారు.





# వారణాసి అత్యాచార ఘటనపై ప్రధాని మోదీ ఆరా

**- నిందితులపై కఠినచర్యలకు ఆదేశం**


వారణాసి: ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో 19 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచార ఘటనలో నిందితులపై కఠిన చర్యలకు ప్రధాని నరేంద్ర మోదీ కఠినమైన చర్యలకు ఆదేశించారు. వారణాసిలో 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ శుక్రవారం తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంలో విమానం దిగిన వెంటనే అత్యాచార ఘటనపై ఆరా తీశారు. ప్రధాని మోదీకి ఈ ఘటనపై నగర పోలీసు కమిషనర్, డివిజనల్ కమిషనర్, జిల్లా మేజిస్ట్రేట్ పూర్తి వివరాలు వెల్లడించారు. నిందితులపై సాధ్యమైనంత త్వరగా కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రధాని ఆదేశించారు.

గత మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఇలా ఉండగా ఈ కేసులో ఇప్పటి వరకూ తొమ్మిది మందిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చారు. 11 మందిని బాధితురాలు గుర్తుపట్టలేదు.

బాధితురాలి తండ్రి చెబుతున్న వివరాల ప్రకారం.. ఆ యువతి మార్చి 29న తన స్నేహితుడ్ని కలవడానికి ఇంటి నుండి బయలుదేరింది. మూడు నాలుగు రోజులైనా ఆమె ఇంటికి రాకపోవడంతో భయపడి, ఆమె కోసం చాలా చోట్ల గాలించాం. కానీ ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ఏప్రిల్ 3న పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఏప్రిల్ 4న ఆమెను పోలీసులు కనుగొన్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స అనంతరం ఆమె సాధారణ స్థితికి చేరుకుని జరిగినదంతా వివరించింది. ఆమె ఇంటర్మీడియట్‌లో కామర్స్ చదివింది. ఆమెకు స్పోర్ట్స్ అంటే ఇష్టం. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన వాళ్లెవరూ నాకు తెలీదు. మాకు న్యాయం చేయాలి. నిందితులకు శిక్ష చాలా తీవ్రంగా ఉండాలి, భవిష్యత్ లో ఇలాంటి తప్పులు చేయకుండా వాళ్లకి తగిన శాస్తి చేయాలని కన్నీటి పర్యంతమయ్యారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్ఐఏ కస్టడీలో రాణా

న్యూఢిల్లీ: ముంబయి ఉగ్రదాడి కుట్రదారు తహవ్వుర్ రాణా ప్రస్తుతం కట్టుదిట్టమైన భద్రత మధ్య జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో ఉన్నాడు. అక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా... నిరంతర నిఘా ఏర్పాటు చేసి అతడి కదలికలను దర్యాప్తు సంస్థ అధికారులు గమనిస్తున్నారు. తమ జ్యుడిషియల్ కస్టడీలో అతడి నుంచి కీలక విషయాలు సేకరించనున్నారు. తహవ్వుర్ రాణాను ఎన్ఐఏకు అప్పగించడంతో ఢిల్లీలో ఎన్ఐఏ భవనం ఉన్న సీజీఓ కాంప్లెక్స్ ప్రాంతమంతా దుర్భేద్యమైన భద్రత ఏర్పాటు చేశారు. భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గదిలో ఇప్పుడు రాణాను ఉంచారు. 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉండే ఒక చిన్న గదిలో 24 గంటల నిఘా కోసం సీసీ కెమెరాలు అమర్చారు. ఆ గదిలో వివిధ అంచెల్లో డిజిటల్ సెక్యూరిటీ సిస్టంను ఏర్పాటు చేశారు. అతడు పడుకోవడానికి నేలపై బెడ్ వేశారు. ఆ గదిలోనే బాత్రూమ్ ఏర్పాటు ఉంది. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు అన్నీ ఆ గదికే వస్తాయని తెలుస్తోంది. అనుమతి లేకుండా ఎవరు లోపలికి వెళ్లడానికి లేదు. కేవలం 12 మంది ఎన్ఐఏ అధికారులకు మాత్రం అనుమతి ఇచ్చారు.



ముంబయి ఉగ్రదాడి కేసులో నిందితుడిగా ఉన్న తహవ్వుర్ రాణాను భారత్ విజయవంతంగా అమెరికా నుంచి తీసుకురాగలిగింది. గురువారం అర్ధరాత్రి రాణాను ఎన్ఐఏ అధికారులు ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపర్చారు. ఆ సమయంలో ఈ కేసుతో సంబంధం లేని వ్యక్తులందరినీ కోర్టు నుంచి బయటకు పంపేశారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరపున కోర్టులో వాదనలను వినిపించారు. రాణా తరపున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సవా వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్‌జిత్ సింగ్ వాదనలు విన్నారు. రాణాను 20 రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఎన్విఏ కోరగా.. 18 రోజుల కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. ప్రస్తుతం అధికారులు అతడిని ప్రశ్నిస్తున్నారు.

### ఎన్ఐఏకు సహకరిస్తాం: ఫడ్నవీస్

ముంబయి: 26/11 ముంబై ఉగ్రదాడి కుట్రలో ఒకడైన తహవుర్ రాణాను అమెరికా నుంచి భారత్ తీసుకురావడం, ఎన్ఐఏ నేతృత్వంలో దర్యాప్తు జరుపుతుండటంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారంనాడు స్పందించారు. దర్యాప్తు విషయంలో ఎన్ఐఏకు ముంబై పోలీసులు సహకరిస్తారని రాష్ట్ర హోం మంత్రిగా కూడా ఉన్న ఫడ్నవిస్ చెప్పారు. రాణాను ఢిల్లీ నుంచి ముంబై తీసుకువస్తారా అని అడిగినప్పుడు, దానిపై ఎన్ఐఏ నిర్ణయిం తీసుకుంటుందని సీఎం జవాబిచ్చారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఎన్ఐఏ కలిసి రాణాను ఎక్కడికి తీసుకువెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఎన్ఏఐకు అన్ని విధాలా సహకరించేందుకు ముంబై పోలీసులు సిద్ధంగా ఉన్నారని, అలాగే దర్యాప్తు అప్డేట్‌లు అవసరమనుకుంటే ముంబై పోలీసులు ఎన్ఐఏను సంప్రదిస్తారని చెప్పారు.

# ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి

**- ఈడీకి సుప్రీంకోర్టు చురకలు**



న్యూఢిల్లీ: ప్రాథమిక హక్కుల గురించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు సుప్రీంకోర్టు చురకలు వేసింది. తమ ప్రాథమిక హక్కుల గరించి అడుగుతున్న ఈడీ.. ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్ఏఎన్) స్కామ్ దర్యాప్తును ఛత్తీస్‌గడ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా శుక్రవారం సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థగా తన హక్కుల గురించి ఈడీ ఈ పిటిషన్ వేసింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అనేది వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో కోర్టులను ఆశ్రయించి వాటిని పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ద్వారా పరిష్కారాలు పొందే హక్కును కల్పిస్తుందని గుర్తు చేసింది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత సోలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ.. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. అదే సమయంలో మాట్లాడుతూ.. ఈడీకి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి అని వ్యాఖ్యానించారు. దీనికి బెంచ్ స్పందిస్తూ.. ఈడీకి ప్రాథమిక హక్కులు ఉంటే. అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని అని చురకలు అంటించి... పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది.

ఈ కేసులో నిందితుడైన మాజీ ఐఏఎస్ అధికారికి గతేడాది మంజూరైన ముందస్తు బెయిల్ దుర్వినియోగమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. దీనికి తోడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని ఏజెన్సీలకు ఓ హైకోర్టు జడ్జితో సంబంధాలు ఉన్నాయని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ కేసులోని కొందరు నిందితులకు న్యాయపరంగా ఉపశమనం కలుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ కేసులో అత్యున్నత స్థాయి వ్యక్తులకు కేటాయించిన ముందస్తు బెయిళ్లను కూడా రద్దు చేయాలని ఈడీ కోరుతోంది. దీంతోపాటు కేసును ఢిల్లీకి బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాజాగా సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

కాగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యక్రమాలను పర్యవేక్షించే నాగరిక్ అపుర్తి నిగమ్ కార్యాలయాలపై 2015లో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ దాడులు చేసి.. రూ. 3.6 కోట్ల నగదు స్వాధీనం చేసుకొంది. బియ్యం నమూనాలు చాలా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించింది. అవి అసలు మనుషులు తినేలా లేవని తేల్చింది. దీనిపై కేసు నమోదు చేసింది. నాడు ఈ సంస్థకు చైర్‌పర్సన్‌గా ఉన్న అనిల్ తుతేజాను కూడా నిందితుడిగా చేర్చింది. ఆయనకు తరువాత బెయిల్ మంజూరయింది.

# తమిళనాడులో మళ్లీ అన్నాడీఎంకే, బీజేపీ పొత్తు

**- పళనిస్వామి నేతృత్వంలోనే ఎన్నికలకు వెళతాం**
**- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రకటన**

చెన్నై: వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య మరోసారి పొత్తు కుదిరింది. తమిళనాడులో ఈ రెండు పార్టీల పొత్తుపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా శుక్రవారం ప్రకటన చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తామని వెల్లడించారు. తమిళనాడు పర్యటనలో ఉన్న అమిత్ షా.. అన్నాడీఎంకే చీఫ్, మాజీ సీఎం పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి చెన్నైలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పళనిస్వామి సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు జట్టుకట్టిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాలు గెలుచుకుంది. అయితే, 2023 సెప్టెంబర్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే నుంచి అన్నాడీఎంకే వైదొలగింది. అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలు అంశాలపై ఇరు పార్టీల నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో ఎన్డీయే, బీజేపీతో సంబంధాలను అన్నాడీఎంకే తెగతెంపులు చేసుకుంది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల్లో తాజాగా వచ్చే ఎన్నికల్లో ఇరు పార్టీలూ కలిసిపోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. అవసరమైతే.. కనీస ఉమ్మడి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని అమిత్ షా తెలిపారు.

1998లో నాటి సీఎం జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పాటైనప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం సాధించామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని అమిత్ షా తెలిపారు. ఆ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తమ పార్టీ జోక్యం చేసుకోబోదన్నారు. ఈ పొత్తు ఎన్డీఏకు, అన్నాడీఎంకేకు మేలు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపు, తదితర అంశాలను తర్వాత నిర్ణయిస్తామన్నారు. తమిళనాడులో డీఎంకే అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సనాతన ధర్మం, త్రిభాషా విధానం వంటి అంశాలను తెరపైకి తీసుకొస్తోందని అమిత్ షా విమర్శించారు.

# ప్రపంచ రాజకీయాల్లో రెండు 'టీ'లదే కీలకపాత్ర

***- విదేశాంగ మంత్రి జై శంకర్***



న్యూఢిల్లీ: ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు 'టీ'లు కీలక భూమిక పోషిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్లో జైశంకర్ మాట్లాడుతూ టెక్నాలజీ, టారిఫ్‌లను ఉద్దేశించి చమత్కారంగా మాట్లాడారు. కొద్దికాలంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు ఇక్కడ 'టీ' పదం గురించి చర్చించడానికి మనం సమావేశమయ్యాం. రెండు 'టీ'లకు మధ్య ఉన్న సంబంధాన్ని మీరు ఆలోచించాలని నేను కోరుకుంటున్నాను. ఈ భౌగోళిక, సాంకేతిక నేపథ్యంలో మనం ప్రపంచాన్ని ఎలా చూడాలి. నేనైతే దీనినొక అవకాశంగా చూస్తాను. ఈ మార్పు గురించి, టి అక్షరం గురించి మాట్లాడేటప్పుడు అమెరికా నుంచే ప్రారంభిస్తాం. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని అమెరికా ప్రాథమికంగా మార్చేసింది. ప్రపంచంపై దాని పరిణామాలు ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణం కాదు. దాంతోపాటు ఆ దేశ సాంకేతిక పురోగతి అత్యంత కీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుంది అన్నది స్పష్టం. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌కు, టెక్నాలజీకి మధ్య సంబంధం ఉంది. 2016 నుంచి 2020 (అప్పుడు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నారు) మధ్య అది ఇంత స్పష్టంగా కనిపించలేదని జై శంకర్ అన్నారు. అలాగే చైనా స్థిరమైన ఎదుగుదలను ప్రస్తావించారు. ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులను గురించి కూడా పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. టారిప్ విషయంలో ఆయన కఠినవైఖరి ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దాంతో ఎక్కడ చూసినా టారిఫ్ అనే పదమే వినిస్తోంది. అలాగే ప్రస్తుతం సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) పదాన్ని ఎక్కువగా వింటున్నాం. ఈ విషయంలో అమెరికా, చైనా పోటీపోటీగా ముందుకు దూసుకెళ్తున్నాయి. దేశ ఎదుగుదలలో టెక్నాలజీ పాత్ర అత్యంత కీలకమనే ఉద్దేశంలో తాజాగా జైశంక ర్ మాట్లాడారు.

# వెనక్కి తగ్గని చైనా





### అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు

అమెరికా, చైనాల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను డ్రాగన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ను యూఎస్ 145 శాతానికి పెంచితే.. డ్రాగన్ నుంచి అదే రియాక్షన్ వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. చైనాపై విధించిన సుంకాలను మొత్తంగా లెక్కిస్తే 145 శాతంగా ఉంటాయని గురువారం శ్వేతసౌధం కార్యనిర్వాహక ఉత్తర్వు వెల్లడించింది. ఈ నేపథ్యంలో తాము విధించిన 84 శాతం సుంకాలను 125 శాతానికి పెంచుతూ తాజాగా చైనా ప్రకటించింది. శనివారంనుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా భివర్ణించిన మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించింది. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది. చైనా వస్తువులపై విధించిన పరస్పర సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. వాషింగ్టన్ సుంకాలపై బీజింగ్ ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేయనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా విధించిన సుంకాలపై చైనా ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తామూ పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్ కియాన్ పేర్కొన్నారు. 'చైనాతో డీల్ చేయాలంటే. ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్ మెయిళ్లు సరైన మార్గం కాదు. రెండు దేశాలు కలిసి కూర్చుని విభేదాల పరిష్కారానికి కృషి చేస్తాయని ఆశిస్తున్నాం. పరస్పర గౌరవం అనే సిద్ధాంతాల ఆధారంగా చర్చలు జరగాలి' అని యాంగ్ కియాన్ అన్నారు.

**ట్రంప్ టారిఫ్ వేళ.. జిన్‌పింగ్ ఫస్ట్ రియాక్షన్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై టారిఫ్‌ల మోత మోగిస్తున్నారు. ఈనేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తొలిసారి స్పందించినట్లు డ్రాగన్ ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా పేర్కొంది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా జిన్‌పింగ్ అభివర్ణించారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి ఐరోపా యూనియన్ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉందన్నారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. అంతేగాకుండా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చని చెప్పారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

# పెంగ్విన్.. కొంపముంచింది

**- హెలికాప్టర్ ప్రమాదానికి కారణం అదే**



ఓ పెంగ్విన్ హెలికాప్టర్ ప్రమాదానికి కారణమైంది. ఈ ఘటన జనవరిలో దక్షిణాఫ్రికాలో చోటు చేసుకోగా.. దర్యాప్తు వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ ఏడాది జనవరి 19న ఈస్టర్న్ కేప్ ప్రాంతంలోని బర్డ్స్ ద్వీపం నుంచి 'రాబిన్సన్ ఆర్44 రావెన్ 2' అనే హెలికాప్టర్ పైకి ఎగిరింది. అది 50 అడుగుల ఎత్తుకు లేవగానే.. ఒక్కసారిగా అదుపుతప్పి నేలను ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి అందులోని ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. దక్షిణాఫ్రికా సివిల్ ఏవియేషన్ అథారిటీ దీనిపై దర్యాప్తు చేపట్టింది. ఈ నాలుగు సీట్ల హెలికాప్టర్లో పెట్టెలో ఉంచిన పెంగ్విన్ ఈ ప్రమాదానికి కారణమని దర్యాప్తు బృందం తేల్చింది. దానిని సురక్షిత పద్ధతుల్లో ఉంచకపోవడంతోనే ఇదంతా జరిగిందని చెప్పింది. ఈ విమానంలో పైలట్, ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఒక నిపుణుడు పెంగ్విన్‌ను పోర్ట్ ఎలిజిబెత్‌కు తరలించాలని కోరడంతో.. పైలట్ కూడా రిస్క్‌ను అంచనావేయకుండా అంగీకరించి దానిని తీసుకున్నాడు. ఆ పెంగ్విన్‌ను ఓ కార్డుబోర్డ్ బాక్స్‌లో ఉంచి హెలికాప్టర్లో పైలట్ పక్కనే ఉన్న వ్యక్తి ఒడిలో ఉంచారు. ఆ లోహ విహంగం 50 అడుగుల ఎత్తు ఎగరగానే.. ఆ బాక్స్ ఒక్కసారిగా పైలట్ సైక్లిక్ పిచ్ కంట్రోల్ లివర్స్‌పై పడింది. దీంతో హెలికాప్టర్ అదుపుతప్పి.. దాని రెక్కలు నేలను తాకడంతో అది కూలిపోయింది. తగిన ఏర్పాట్లు లేకుండా పెంగ్విన్‌ను హెలికాప్టర్లలో తరలించడం సరైన చర్య కాదని దక్షిణాఫ్రికా సీఏఏ తన నివేదికలో పేర్కొంది. దీనికితోడు పైలట్ కూడా దానిని కార్డుబోర్డు బాక్స్‌లో తరలించి.. ముప్పును అంచనావేయడాన్ని విస్మరించాడని పేర్కొంది.

# హమాస్ స్నైపర్ ఫోర్స్ కమాండర్ హతం

**- గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్**



గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ అట్టుడుకుతోంది. హమాస్ కీలక ఆయుధ స్థావరాలు, నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. గురువారం ఐడీఎఫ్‌కు చెందిన విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు హమాస్‌కు చెందిన 40 స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో హమాస్ స్నైపర్ ఫోర్స్ టెల్ సుల్తాన్ బెటాలియన్ కమాండర్ అహ్మద్ ఐయాద్ మహమ్మద్ ఫర్హాత్ హతమయినట్లు వెల్లడించారు.

మహమ్మద్ ఫర్హాత్ హమాస్ ఇజ్రాయెల్‌పై అనేక దాడులకు పథక రచన చేసినట్లు, సైన్యాన్ని ముందుండి నడిపినట్లు తెలుస్తోంది. అతడిని హతమార్చడంతో ఇజ్రాయెల్ మరో విజయం సాధించిందని ఐడీఎఫ్ పేర్కొంది. రఫా, ఖాన్ యూనిస్, మొరాగ్ కారిడార్ ప్రాంతాల్లో తమ దళాలు దాడులు చేయగా.. పలువురు హమాస్ కార్యకర్తలు మృతి చెందినట్లు వెల్లడించింది. పెద్ద మొత్తంలో భూగర్భ మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. బుధవారం వైమానిక దాడిలో కూడా దాదాపు 40 హమాస్ లక్ష్యాలను నాశనం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇప్పటికే గాజాలో 50శాతం భూభాగాన్ని ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు పేర్కొంది. గత 18 నెలలుగా సాగుతున్న గాజా యుద్ధంలో 50 వేలమంది పాలస్తీనియన్లు మృతిచెందారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలు. హమాస్ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేంత వరకూ దాడుల తీవ్రత పెంచుతూనే ఉంటామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. కాగా.. పాలస్తీనియన్లకు నిలువనీడ లేకుండా చేయడమే ధ్యేయంగా.. మౌలిక సదుపాయాలు మళ్లీ వాడుకోలేని విధంగా తాము ధ్వంసం చేస్తున్నామని అసోసియేటెడ్ ప్రెస్(ఏపీ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు పేర్కొన్న విషయం తెలిసిందే.

# కౌంటర్‌లో పడిన చైనా

**పొరుగు దేశాలతో మిత్రత్వం కోసం వెంపర్లాట**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 145 శాతం సుంకాలు విధించడంతో.. చైనా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పొరుగు దేశాలతో జట్టు కట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఆ దేశాధినేత జిన్‌పింగ్ ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకునేందుకు పర్యటనలు జరపాలని నిర్ణయించుకున్నారు.

ఏప్రిల్ 14నుంచి 18వరకు వియత్నాం, మలేసియా, కంబోడియా దేశాల్లో పర్యటించాలని నిర్ణయించినట్లు చైనా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాలకు ఆసియాన్ గ్రూప్‌లో సభ్యత్వం ఉంది. ఈ గ్రూప్‌నకు చైనాకు మధ్య ఏటా 962 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుంది. దీనిలో 575 బిలియన్ డాలర్లు చైనా ఎగుమతులే ఉంటున్నాయి.

వాస్తవానికి ట్రంప్ టారిఫ్‌లు ప్రకటించిన తర్వాత చాలా దేశాలు ఆచితూచి స్పందించాయి. కానీ, చైనా మాత్రం వాషింగ్టన్‌పై ఏకంగా 84శాతం పన్నులు విధించింది. దీంతో అమెరికా టారిఫ్‌ను మొత్తం కలిపి బీజింగ్‌పై 145 శాతానికి పెంచింది. ప్రతిఘటించని దేశాలకు 90 రోజుల సమయం ఇస్తూ ట్రంప్ చకచక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో అమెరికాలో ఇతర దేశాల వస్తువులతో పోలిస్తే.. చైనా దిగుమతి వస్తువుల రేట్లు చాలా ఎక్కువగా ఉండనున్నాయి. దీంతో సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గింది. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలకు నిరసనగా ఫిల్మ్‌ల దిగుమతులను తగ్గించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే తుదివరకూ తాము పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్ కియాన్ పేర్కొన్నారు. చైనాతో డీల్ చేయాలంటే, ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు సరైన మార్గం కాదన్నారు.




# రాణా అప్పగింత ఫొటో

**విడుదల చేసిన అమెరికా న్యాయశాఖ**

ముంబయి ఉగ్రదాడి (26/11) ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అమెరికాలో యూఎస్ మార్షల్స్ రాణాను భారత్‌కు అప్పగిస్తున్న ఫొటో ఒకటి బయటకు వచ్చింది. దానిని అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. న్యాయశాఖ విడుదల చేసిన ఫొటోల్లో రాణా జైలు దుస్తులు, చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో కనిపించాడు. చుట్టూ అమెరికా పోలీసులున్నారు. తమ కస్టడీ నుంచి అతడిని భారత విదేశాంగ శాఖ ప్రతినిధులకు అప్పగించారు. భద్రతపరంగా కట్టుదిట్టమైన ప్రాంతంలో ఏప్రిల్ 9న ఈ అప్పగింత ప్రక్రియను పూర్తిచేశారు. తర్వాత అతడిని ప్రత్యేక విమానంలో ఏప్రిల్ 11న భారత్‌కు తీసుకువచ్చారు.

గురువారం అర్ధరాత్రి రాణాను ఎన్ఐఏ అధికారులు ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపర్చారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరపున కోర్టులో వాదనలను వినిపించారు. రాణా తరపున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సచ్దేవా వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్ జిత్ సింగ్ వాదనలు విన్నారు. రాణాను 20 రోజులపాటు తమ కస్టడీకి అనుమతించాలని ఎన్ఐఏ కోరగా.. 18 రోజుల కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు.



# చిత్తుగా ఓడిన చెన్నై!

- ధోని కెప్టెన్సీలోనూ మారని సీఎస్కే అదృష్టం
- వరుసగా ఐదో పరాభవం
- తొలుత బ్యాటింగ్ చేసి 103 పరుగులకే పరిమితం
- 8 వికెట్లతో అలవోకగా గెలిచిన కేకేఆర్

చెన్నై: సొంత మైదానంలో చెన్నై చిత్తుగా ఓడింది. ఐపీఎల్ 2025లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో శుక్రవారం చెన్నై చెపాక్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అలవోకగా విజయం సాధించింది. సీఎస్కేను 8 వికెట్ల తేడాతో కేకేఆర్ చిత్తుచిత్తుగా ఓడించింది. ఈ సీజన్‌లో  తొలిసారి సీఎస్కే కెప్టెన్‌గా బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ పూర్తిగా నిరాశ పరిచాడు. టాస్ గెలిచిన కేకేఆర్ బౌలింగ్ ఎంచుకోగా.. సీఎస్కే బ్యాటింగ్ చేసింది. సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 103 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 104 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు 10.1 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయాన్ని సాధించింది. కేకేఆర్ ఈ మ్యాచ్ గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది.

### చెలరేగిన క్వింటన్ డికాక్, సునీల్ నరైన్

స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన కేకేఆర్ ఓపెనర్లు క్వింటన్ డికాక్, సునీల్ నరైన్ ముందు నుంచే దూకుడుగా ఆడారు. క్వింటన్ డికాక్ 16 బంతుల్లో 23 పరుగులు చేయగా.. సునీల్ నరైన్ 18 బంతుల్లో 44 పరుగులు చేసి ఔటయ్యారు. అనంతరం రహానే(20), రింకూ సింగ్(15)లు ఇద్దరూ కలిసి కోల్‌కతా జట్టును విజయ తీరాలకు నడిపించారు. సీఎస్కే బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్ చెరో వికెట్ తీయగలిగారు.

### సీఎస్కే బ్యాటింగ్ పూర్తిగా విఫలం

కేకేఆర్ తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్కే బ్యాటింగ్ ఘోరంగా విఫలమైంది. కేకేఆర్ బౌలర్లు సీఎస్కే ఓపెనర్లు ఇద్దరినీ 16 పరుగుల స్కోరు వద్ద పెవిలియన్‌కు పంపారు. అనంతరం విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్ నిర్వహించడానికి ప్రయత్నించారు. కానీ వారు కూడా కేకేఆర్ బౌలర్ల ముందు నిలబడలేకపోయారు. విజయ్ శంకర్ 21 బంతుల్లో 29 పరుగులు చేశాడు. రాహుల్ త్రిపాఠి 22 బంతుల్లో 16 పరుగులు చేశాడు. ఒకవైపు శివం దూబే సీఎస్కే తరపున పోరాటం చేశాడు.



కానీ అతను కూడా జట్టు తరపున వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. సీఎస్కే తరపున శివం దూబే చివరి వరకు నాటౌట్ గా నిలిచాడు. 29 బంతుల్లో 31 పరుగులు చేశాడు. ధోనితో సహా జట్టులోని 6 గురు బ్యాటర్లు (అశ్విన్: 1, జడేజా: 0, దీపక్ హుడా: 0, ధోనీ:1, నూర్ అహ్మద్: 1, అన్షుల్: 3) కలిసి 6 పరుగులు మాత్రమే జోడించటం గమనార్హం. ఈ కారణంగానే సీఎస్కే జట్టు సొంతమైదానంలో దారుణంగా విఫలమైంది.

### కేకేఆర్ బౌలింగ్.. అద్భుతమే

సీఎస్కేపై కేకేఆర్ బౌలింగ్ గురించి చెప్పాలంటే.. చాలా అద్భుతంగా ఉంది. కేకేఆర్ తరపున సునీల్ నరైన్ అత్యధికంగా మూడు వికెట్లు పడగొట్టాడు. హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తిలు కూడా తమ మ్యాజిక్ ను ప్రదర్శించి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వైభవ్ అరోరా, మొయిన్ అలీలు చెరో వికెట్ తీసుకున్నారు.

### కెప్టెన్ అయిన తొలి అన్ క్యాప్డ్ ప్లేయర్

ఈ మ్యాచ్‌లో ధోని కెప్టెన్‌గా ఒక చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా మహేంద్ర సింగ్ ధోనీ రికార్డులకు ఎక్కాడు. అయ్యాడు. గాయం కారణంగా సీఎస్కే రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొత్తం సిరీస్ కు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో రుతురాజ్ స్థానంలో ఎంఎస్ ధోనికి కెప్టెన్సీ ఇచ్చారు. ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలో అన్‌క్యాప్డ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి ఆటగాడిగా ధోనీ నిలిచాడు. మహీకి ముందు ఇప్పుడు వరకు ఏ అన్‌క్యాప్డ్ ఆటగాడు ఐపీఎల్‌లో కెప్టెన్ గా వ్యవహరించలేకపోయాడు. కానీ ఇప్పుడు ఎంఎస్ ధోని ఈ ఘనత సాధించాడు.

### బీసీసీఐ నిబంధన ఇదే..

ఐపీఎల్ 2025కి ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసఐ) ఈ నియమాన్ని రూపొందించింది. వాస్తవానికి ఏ ఆటగాడు అయినా 4 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం భారత జట్టుకు దూరంగా ఉంటే అతడిని అన్‌క్యాప్డ్ ప్లేయర్ గా పరిగణిస్తారు. ధోనీ చివరిసారిగా 2019 సంవత్సరంలో భారత్ తరపున ఆడాడు. దీని తర్వాత ఎంఎస్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. అటువంటి పరిస్థితిలో ధోనీ భారత్ తరపున ఆడి దాదాపు 5 సంవత్సరాలు అయ్యింది. అంటే ధోనీ ఐపీఎల్ 2025లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ గా పాల్గొంటున్నాడు. ఇది కాకుండా ఐపీఎల్ లో కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టిన అతిపెద్ద వయస్సు ఆటగాడిగా ఎంఎస్ ధోనీ నిలిచాడు. ప్రస్తుతం ధోని వయస్సు 43 సంవత్సరాల 278 రోజులు. మరోవైపు ఎంఎస్ ధోనీ 683 రోజుల తర్వాత కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టాడు. ఇంతకు ముందు 2023లో ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

## 110 కోట్ల ఒప్పందాన్ని వదులుకున్న కోహ్లీ!



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఒక కీలక నిర్ణయం తీసుకున్నాడు. జర్మన్ స్పోర్ట్స్ బ్రాండ్ పూమాతో తన రూ.110 కోట్ల ఒప్పందాన్ని ముగించాడు. విరాట్ కోహ్లీ పూమా బ్రాండ్‌తో ఎనిమిదేళ్ల అనుబంధం కలిగి ఉన్నాడు. పూమా బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న విరాట్ కోహ్లీ.. రూ.110 కోట్ల విలువైన ఒప్పందాన్ని కలిగి ఉన్నాడు. అయితే తాజాగా విరాట్ కోహ్లీ ఈ డీల్‌ను వదులుకునేందుకు సిద్ధమయ్యాడని తెలిసింది. విరాట్ కోహ్లీ ఇప్పుడు బిజినెస్ రంగంలో అద్భుతంగా రాణిస్తున్నాడు. తన సొంత బ్రాండ్ అయిన వన్8 కంపెనీని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాడు. స్పోర్ట్స్‌వేర్, ఫుట్ వేర్, దుస్తులు వంటి విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న వన్ 8ను మరింత విస్తరించేందుకు విరాట్ కోహ్లీ కీలక నిర్ణయం తీసుకున్నాడు.

విరాట్ కోహ్లీ ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకెళ్తున్నాడు. విరాట్ కోహ్లీ క్రీడా అథ్లెటర్ కంపెనీ అజిలిటాస్ లో పెట్టుబడిదారుడిగా చేరనున్నట్లు తెలుస్తోంది. అజిలిటాస్ కంపెనీని అభిషేక్ గంగూలీ 2023 సంవత్సరంలో ప్రారంభించారు. అభిషేక్ గతంలో కోహ్లీని పూమాతో పని చేసేలా ఒప్పించాడు. 2017 సంవత్సరం నుంచి కోహ్లీ పూమాకు బ్రాండ్ అంబాసిడర్ గా ఒప్పందాన్ని కలిగి ఉన్నాడు. విరాట్ కోహ్లీకి సొంత బ్రాండ్ వన్8 ఉంది. దీనిని విరాట్ కోహ్లీ 2017 సంవత్సరంలో ప్రారంభించారు. విరాట్ కోహ్లీ ఇప్పుడు తన వన్8 బ్రాండ్ ను అజిలిటాస్ ద్వారా గ్లోబల్ మార్కెట్లోకి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అజిలిటాస్ అభివృద్ధిలో వన్8 కీలక భాగస్వామిగా మారుతుంది.

పూమా ప్రతినిధి కూడా విరాట్ కోహ్లీ డీల్ ముగిసిన విషయాన్ని ధ్రువీకరించారు. పూమా ప్రతినిధి మాట్లాడుతూ.. "క్రికెటర్, బ్రాండ్ అంబాసిడర్ విరాట్ కోహ్లీతో తన దీర్ఘకాల భాగస్వామ్యం ముగింపును స్పోర్ట్స్ బ్రాండ్ పూమా ఇండియా ధ్రువీకరిస్తోంది. పూమా విరాట్ భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలియజేస్తోంది. చాలా సంవత్సరాలుగా కోహ్లీతో అద్భుతమైన అనుబంధం ఉంది. " అని అన్నారు. అంటే దీని అర్థం పూమా కోహ్లీ భవిష్యత్ కు శు భాకాంక్షలు తెలిపింది. కోహ్లీతో కలిసి పనిచేయడం గొప్ప అనుభవమని ఆయన అన్నారు. ఈ విషయాన్ని మింట్ నివేదించింది.

## రోహితే నా ఫేవరేట్ ఇండియన్ ప్లేయర్: ట్రావిస్ హెడ్

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన ఫేవరేట్ ఇండియన్ క్రికెటర్ అని, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తెలిపాడు. రోహిత్ శర్మ బ్యాటింగ్ అంటే తనకు చాలా ఇష్టమని చెప్పాడు. అతని కెప్టెన్సీ కూడా అద్భుతమని కొనియాడాడు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ఓ క్రికెట్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రావిస్ హెడ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఇంటర్వ్యూలో క్వశ్చన్ ఆన్సర్ సెషన్ నిర్వహించగా.. ట్రావిస్ హెడ్ తనదైన శైలిలో బదులిచ్చాడు. రోహిత్ శర్మ తన ఫేవరేట్ ఇండియన్ బ్యాటర్ అని చెప్పిన ట్రావిస్ హెడ్.. ఆస్ట్రేలియా జట్టులో ఉండాలని తాను కోరుకునే భారత ఆటగాడు కూడా అతనేనని తెలిపాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కాకుండా ఇతర ఫ్రాంచైజీకి ఆడాలంటే ముంబై ఇండియన్స్‌ను ఎంచుకుంటానని చెప్పాడు. మూడు ప్రశ్నలకు సమాధానం రోహిత్ శర్మకు సంబంధించినవే చెప్పడంతో రోహిత్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ శర్మకు ట్రావిస్ హెడ్ డై హార్డ్ ఫ్యాన్ ఉన్నట్టున్నాడుగా అని కామెంట్ చేస్తున్నారు.

ఐపీఎల్ 2025 సీజన్‌లో ట్రావిస్ హెడ్ వైఫల్యం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ట్రావిస్ హెడ్ ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 67, 47, 22, 4, 8 పరుగులే చేశాడు. అతని వైఫల్యం



జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది. తొలి మ్యాచ్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా 4 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. పంజాబ్ కింగ్స్‌తో శనివారం జరిగే మ్యాచ్‌లోనైనా ట్రావిస్ హెడ్ రాణించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

### ట్రావిస్ హెడ్‌పై ఫ్యాన్స్ ఫైర్

ట్రావిస్ హెడ్‌పై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ అభిమాని సెల్ఫీ రిక్వెస్ట్‌ను అతను నిరాకరించడం నెట్టింట చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. సూపర్ మార్కెట్‌కు వచ్చిన ట్రావిస్ హెడ్‌ను కొందరు అభిమానులు సెల్ఫీ కావాలని కోరారు. అందుకు ట్రావిస్ హెడ్ నిరాకరించాడు. తాము సన్‌రైజర్స్ అభిమానులమని చెప్పినా వినిపించుకోలేదు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. ఇంత బలుపు ఏంటని ఫ్యాన్స్ మండిపడ్డారు.

## ఇంట్రోతో మొదలెడతాడట

ప్రశాంత్ నీల్ –ఎన్టీఆర్ కాంబో ప్రాజెక్టుపై రోజుకొక రూమర్ చక్కర్లు కొడుతోంది. ఈనెల 22నుంచి కొత్త షెడ్యూల్ స్టార్ట్ కానున్న నేపథ్యంలో.. ఎన్టీఆర్ ఎంట్రీ సీన్స్‌ను షూట్ చేస్తారన్న మాట వినిపిస్తోంది. మూవీ టైటిల్ 'డ్రాగన్' అని ఇప్పటికే ప్రచారంలో ఉంది. 'డ్రాగన్' ప్రాజెక్టును ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. ప్రశాంత్ నీల్ ప్రాజెక్టుల్లో ది బెస్ట్ ఇదే అవుతుందని అంచనాలు లేకపోలేదు. ఆమధ్య సినిమా గురించి ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ ఊహించని స్థాయిలో మూవీ ఉంటుంది. ఎన్టీఆర్‌పై అభిమానంతో ప్రాజెక్టు చేస్తున్నానని చెప్పడం తెలిసిందే. మొత్తానికి భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'ప్రశాంత్ నీల్ –ఎన్టీఆర్' సినిమా గురించి నిత్యం ఏదొక రూమర్ వినిపిస్తూనే ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి సినిమాని నిర్మిస్తున్నాయి. సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



## ఓటీటీకి వచ్చేస్తున్న కోర్టు

నాచురల్ స్టార్ నాని హీరోగానే కాదు, నిర్మాతగానూ పలు సినిమాలు చేస్తున్నాడు. లేటెస్ట్‌గా తాను నిర్మాణం వహించిన చిత్రమే "కోర్ట్". యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు ప్రియదర్శి హీరోగా మరో యువ నటీనటులు హర్షరోహన్ అలాగే శ్రీదేవిలు మెయిన్ లీడ్‌లో దర్శకుడు రామ్ జగదీష్ తెరకెక్కించిన కోర్ట్ థ్రిల్లర్ మంచి విజయాన్ని సాధించింది. ఇక ఫైనల్‌గా ఈ సినిమా ఓటీటీలో ఆడియెన్స్‌ని అలరించేందుకు వచ్చేసింది. నెట్ ఫ్లిక్స్ సొంతం ప్రాజెక్టు, శుక్రవారంనుంచి పాన్ ఇండియా భాషల్లో అందుబాటులోకి వచ్చేసింది. మరి తెలుగు ఆడియెన్స్‌ని అలరించిన చిత్రం



ఇపుడు పాన్ ఇండియా ఆడియెన్స్‌లో ఎలాంటి రెస్పాన్స్‌ని అందుకుంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి బేబి సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూర్చగా.. నటుడు శివాజీ సాలిడ్ రోల్‌ని చేసిన సంగతి తెలిసిందే.

## ఏ యుగంలో ఉన్నాం!?

నెలసరి పేరిట ఓ విద్యార్థినిని తరగతి గది బయట కూర్చోబెట్టి పరీక్ష రాయించిన ఘటన తమిళనాడులో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియా వేదికగా చర్చనీయాంశమైన ఈ అమానవీయ ఘటనపై తాజాగా నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆ సమయంలో ఒక విద్యార్థినిని క్లాస్‌రూమ్ బయటే కూర్చొపెట్టి పరీక్ష రాయించడం విచారకరం.
నా రాష్ట్రంలో జరిగిన ఈ ఘటన నన్నెంతో షాక్‌కు గురి చేసింది. మనం ఏ యుగంలో బతుకుతున్నాం? ఎక్కడ ఉన్నాం? ఇలాంటి పనులకు పాల్పడిన విద్యాసంస్థలు, అందులోని సిబ్బందికి ఏమాత్రం సిగ్గుగా అనిపించడం లేదా? వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఆ విద్యార్థినికి వారు క్షమాపణలు చెప్పాలి. సహజమైన చర్యపట్ల మానసిక పరిపక్వతలేని అధికారులకు సరైన గుణ పాఠం నేర్పించాలి" అని రాసుకొచ్చారు. ఈ వీడియో వైరలైన నేపథ్యంలో హెచ్ఎం ఆనందిని పాఠశాల యాజమాన్యం ఇప్పటికే సస్పెండ్ చేసింది.

## బ్లో అప్



అమైరా దస్తూర్

## ప్రత్యేక పాటలో మిల్కీ బ్యూటీ

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రైడ్ 2'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యం లో రాజ్‌కుమార్ గుప్తా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో తమన్నా ఓ స్పెషల్ సాంగులో కనిపించనున్నారు.తాజాగా చిత్రబృందం 'నషా నషా..' అంటూ సాగేపాటను విడుదల చేసింది.



ఇందులో తమన్నా తన హుషారైన స్టెప్పులతో యూత్‌ను ఆకట్టుకుంటున్నారు.

## అల్లు అట్లీ.. బోర్డులోకి జాన్వీ!

'ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ' సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది? ఎప్పుడు రిలీజ్ కాబోతుంది? అంటూ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, సినిమాలో ప్రియాంక చోప్రా నటిస్తున్నారని టాక్ నడిచింది. ఇప్పుడు మరో క్రేజీ హీరోయిన్ పేరు తెరపైకి వస్తోంది. సినిమాలో జాన్వీకపూర్‌ను కూడా తీసుకునే ఆలోచనలో టీమ్ ఉందట. బన్నీకోసం అట్లీ పవర్‌ఫుల్ స్క్రిప్ట్ పూర్తి చేశాడని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో దాన్‌చుట్టూ కథా నేపథ్యం ఉంటుందనీ టాక్. సినిమా మెయిన్ కథాంశమే కొత్తగా ఉంటుందట. మొత్తానికి బన్నీ –అట్లీనుంచి పవర్‌ఫుల్ యాక్షన్ అండ్ ఎమోషనల్ డ్రామా రాబోతుందన్న మాట. జీ స్టుడియోస్ నిర్మించనున్న ప్రాజెక్టును త్వరలోనే షూట్ స్టార్ట్ చేస్తారని తెలుస్తోంది. అట్లీ ప్రాజెక్టు తర్వాత బన్నీతో త్రివిక్రమ్ మూవీ ఉండొచ్చు.



## దృష్టిపెట్టాల్సింది వాటిపైన..

సామాజిక మాధ్యమా ల వేదికలపై చురుగ్గావుండే రేణుదేశాయ్.. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో రెండో వివా హంపై స్పందించారు. "మీడియావాళ్ళు నారెండో పెళ్లిపై ఎంతో ఆసక్తిగా ఉన్నారని నాకర్థమవు తోంది. ఇటీవల నేను గంటకు పైగా మాట్లా డిన పాడకాస్ట్‌లో ఇతర ముఖ్యమైన విషయాల (మతం, బంధాలు, సామాజిక మాధ్య మాల ప్రభావం) కన్నా కూడా శ్రోతలు నా రెండో పెళ్లికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని మరోసారి నిరూపితమైంది. నేను మీ అందరినీ కోరేది ఒక్కటే. దయచేసి ఈ 44ఏళ్ల మహిళ వివాహం విష యంనుంచి మీ దృష్టిని మరల్చండి. నేను మాట్లాడిన పన్ను ఆంక్షలు, మహిళా భద్రత, ఆర్థికవృద్ధి, వాతావ రణ మార్పులు తదితర విషయాలపై శ్రద్ధ పెట్టడం అవసరం. అలా చేస్తే మనం మంచి పౌరు లుగా.. అంతకుమించి గొప్ప మనుషులుగా ఉంటాం. నా పెళ్లి గురించి ఇప్పటికే వందలసార్లు మాట్లాడాను. ఎందు కంటే ఇది కచ్చితంగా నా జీవితాన్ని, నా స్నేహితులను ప్రభావితం చేసే విషయం. దయచేసి మీ చదువు, విజ్ఞానం, జర్నలిజంలో మీకున్న అనుభవాన్ని ఒక మహిళ రెండో పెళ్లి కోసం ఉపయోగించకండి. ఇదేమీ సమాజాన్ని, చట్టాలను ప్రభావితం చేసే విషయం కాదు' అని రేణు దేశాయ్ అసహనం వ్యక్తం చేశారు.

## భయమేస్తోంది తెలుసా..!

సోషల్ మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తిచేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. వారిది విషపూరితమైన స్వభావం అని పేర్కొన్నారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. "విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని? మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. మీతోపాటు జీవించే వారి విషయంలో బాధగా అనిపిస్తుంది. నిజం చెప్పాలంటే మీది పిరికితనం. ఆ దేవుడు ఆశీస్సులు మీకు ఉండాలని కోరుకుంటున్నా" అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. త్రిష ఈవిధమైన పోస్టులు పెట్టడం తొలిసారి కాదు. తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై గతంలోనూ ఆమె మండిపడ్డారు. వారి ప్రవర్తన ఏమీ బాలేదన్నారు. అలాంటి వారి మాటలు పట్టించుకోనని చెప్పారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

ఇందులో ఆమె రోలు కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంత మంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు ఆమె గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు. అదీ త్రిష అసహనానికి కారణం.

